సమష్టి కృషితో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం
- సమ్మిళిత రంగాలకు ప్రాధాన్యమివ్వాలి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను వెల్లడించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

-8లో



ఉద్రిక్తం

పాత జైలు రోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్టు తొలగింపునకు జీవీఎంసీ సమాయత్తం

అడ్డుకున్న వ్యాపారులు
రోడ్డుపై పడుకుని నిరసన



ఫుడ్‌కోర్టు షాపులను తరలిస్తున్న దృశ్యం

- అయినా వెనక్కితగ్గని టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది
- యంత్రాలతో వాహనాల్లోకి దుకాణాలు
- ఎమ్మెల్యే వంశీకృష్ణ అభ్యంతరం... స్థానిక ఎమ్మెల్యేనైన తనకు చెప్పాల్సిన అవసరం లేదా అంటూ ఆగ్రహం
- కొంతసేపు ఆగిన ప్రక్రియ
- తర్వాత యథావిధిగా కొనసాగింపు
- కౌన్సిల్ తీర్మానానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నామన్న కమిషనర్

షాపులను ట్రాలర్ ద్వారా తరలిస్తున్న సిబ్బంది



విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రోడ్డు మార్జిన్లు ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర ఆక్రమణల తొలగింపు కోసం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రారంభించిన 'ఆపరేషన్ లంగ్స్' కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. గురువారం ఎనిమిది జోన్ల పరిధిలో 524 ఆక్రమణలను తొలగించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు...శుక్రవారం మరో 529 ఆక్రమణలను తొలగించారు.

ప్రధానంగా పాత జైలురోడ్డులోని నైట్‌ఫుడ్ కోర్టులో దుకాణాల తొలగింపు ప్రక్రియ టౌన్‌ప్లానింగ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచే ప్రారంభమైంది. దుకాణాలను తొలగిస్తున్న విషయం తెలియగానే వ్యాపారులు అక్కడకు చేరుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా దుకాణాలను ఎలా తొలగిస్తారంటూ దుకాణాల తొలగింపును అడ్డుకున్నారు. టౌన్ ప్లానింగ్ డీసీపీ హరిదాసు వివరణ ఇస్తూ ఫుడ్ కోర్టుకు ఎలాంటి అనుమతులు లేనందువల్లనే నోటీసులు ఇవ్వలేదన్నారు. ఫుడ్‌కోర్టును తొలగించాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో గత ఏడాది డిసెంబరులోనే తీర్మానం చేశారని, తాజాగా గత నెల 22న మరోసారి ఇదే అంశంపై తీర్మానం చేయడంతో చర్యలు చేపడుతున్నామన్నారు. దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో తామే యంత్రాలతో వాటిని తొలగించి యార్డుకు తరలిస్తామని హెచ్చరించారు. దీంతో సుమారు 80 మంది వరకూ వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. మిగిలినవారు మాత్రం దుకాణాల తొలగింపునకు అడ్డంపడడంతోపాటు యంత్రాలకు అడ్డంగా రోడ్డుపై పడుకుని జీవీఎంసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు, వార్డు సచివాలయంలోని మహిళా పోలీసులు వారిని వాహనాల్లోకి ఎక్కించి అక్కడ నుంచి బయటకు తరలించారు. ఈ దశలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ



షాపులను తొలగించవద్దంటూ ధర్నా చేస్తున్న వ్యాపారులు

శ్రీనివాస్ జోక్యం చేసుకుని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, మేయర్ పీలా శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడి ఫుడ్‌కోర్ట్ తొలగింపును

... మిగతా 6వ పేజీలో

ప్రయాణికుల

ప్రాణాలతో చెలగాటం

- ఎయిరిండియా ఘటనపై సర్వత్రా ఆందోళన
- విమానాశ్రయ పరిసరాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- పక్షుల సంచారానికి అదే కారణం
- ఇటీవల సమావేశంలో హెచ్చరించిన కలెక్టర్
- స్పందించని అధికారులు
- ఎయిర్‌పోర్టులోనే ఎయిరిండియా విమానం మరమ్మతులు చేస్తున్న సాంకేతిక నిపుణులు



పక్షి ఢీకొనడంతో వెనక్కి వచ్చిన ఎయిరిండియా విమానం (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం,
సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

విశాఖ నుంచి హైదరాబాద్ బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని గురువారం పక్షి ఢీకొన్న ఘటనపై ప్రస్తుతం జోరుగా చర్చ జరుగుతోంది. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతోనే పెనుప్రమాదం తప్పిందని చెబుతున్నారు. విమానాశ్రయ పరిసరాల్లో పక్షుల సంచారానికి ప్రధాన కారణం పారిశుధ్య చర్యలు సవ్యంగా చేపట్టకపోవడమేనని భావిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పారిశుధ్యం సమస్యనే ప్రధానంగా ప్రస్తావించినప్పటికీ యంత్రాంగం సత్వరం స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశాఖపట్నం నుంచి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ వెళ్లేందుకు బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని పక్షి ఢీకొనడంతో అత్యవసర ల్యాండింగ్ చేసిన విషయం తెలిసిందే. టేకాఫ్ అయిన పది నిమిషాలకే విమానం రెండో నంబరు ఇంజన్‌ను ఓ పక్షి ఢీకొనడంతో పైలట్ అత్యవసర ల్యాండింగ్ చేశారు. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతోనే పెనుప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో ఇటీవల గుజరాత్‌లో జరిగిన విమాన ప్రమాదాన్ని గుర్తుచేసుకుని ప్రయాణికులతో పాటు విమానాశ్రయ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు.

హెచ్చరించినా చర్యలు నిల్

విమానాశ్రయ పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సరిగ్గా నెల రోజుల కిందట విమానాశ్రయ పర్యావరణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా పారిశుధ్యం పైనే చర్చించారు. పోర్టు సమీప గెడ్డల్లో పూడికతీత చేపట్టలేదని, పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో డ్రైవర్లు ఆహార వ్యర్థాలు వేస్తున్నట్టు గుర్తించామని విమానాశ్రయ డైరెక్టర్ ఎన్.పురుషోత్తం సమావేశంలో ఫిర్యాదు చేశారు. దీనివల్ల ఈ ప్రాంతంలో పక్షుల సంచారం పెరిగి విమాన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని కూడా

... మిగతా 6వ పేజీలో

చంద్రంపాలెం పాఠశాలపై లోకేశ్ ఫోకస్

మైదానం అభివృద్ధికి ఆదేశాలు

- రూ.ఐదు లక్షలతో తాత్కాలికంగా పనులు
- రూ.కోటితో పక్కాగా చేపట్టేందుకు విద్యా శాఖ ప్రతిపాదనలు



చంద్రంపాలెం స్కూలు మైదానం మట్టితో కప్పుతున్న దృశ్యం

విశాఖపట్నం,
సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

చంద్రంపాలెం జడ్పీ హైస్కూల్ అభివృద్ధిపై మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. పాఠశాలలో వసతులు మెరుగుపరచాలని ఆదేశించారు.

వర్షపు నీరు నిల్వ ఉండకుండా పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఏఐ ల్యాబ్స్ ప్రారంభోత్సవం నిమిత్తం గత నెల పాఠశాలకు వచ్చిన ఆయన... బురదమయంగా ఉన్న మైదానాన్ని చూసి అసంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల మైదానాన్ని బాగు చేయించాలని డీఈవో ప్రేమ్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఏపీ మౌలిక వసతుల కల్పన సంస్థ ఇంజనీర్లు ఇటీవల పాఠశాల మైదానాన్ని పరిశీలించి వర్షపు నీరు చేరకుండా తాత్కాలిక పనులు చేపట్టేందుకు రూ.ఐదు లక్షలతో ప్రతిపాదనలు తయారుచేసి డీఈవోకు అందజేశారు. డీఈవో సూచనతో వారం క్రితం మైదానంలో మట్టి వేసి కొంతవరకు గోతులు లేకుండా చదునుచేశారు. ఇది తాత్కాలికమేనని, వర్షం వచ్చినప్పుడు మళ్లీ నీరు నిలిచిపోయి బురదమయం అవుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పాఠశాల ఉన్న ప్రాంతం ఒకప్పుడు చెరువు కావడంతో పరిసర ప్రాంతాల్లో వర్షం పడితే నీరు రావడం జరుగుతుంది. చుట్టూ ప్రహరీ గోడ నిర్మించినా పాఠశాల ఆవరణలో వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. వందల లారీల మట్టి తోలినా మైదానం పరిస్థితి మెరుగుపడలేదు. వర్షం వస్తే విద్యార్థులు బురదలో తరగతులకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి లోకేష్ తొలుత పాఠశాల మైదానాన్ని పూర్తిగా బాగుచేయాలని అధికారులు ఆదేశించారు. మైదానాన్ని పక్కాగా అభివృద్ధి చేయాలంటే రూ.కోటి అవసరమని ఇంజనీర్లు చెబుతున్నారు. పాఠశాల చుట్టూ డ్రైన్లు నిర్మించాలని, అలాగే

... మిగతా 6వ పేజీలో

ఉలిక్కిపడిన పారిశ్రామిక ప్రాంతం

హెచ్‌పీసీఎల్‌లో ప్రమాదంతో కలవరం

- ఘటనపై అధికారుల విచారణ
- మానవ తప్పిదమా?, సాంకేతిక సమస్యా?...అనే అంశం పరిశీలన



అగ్ని ప్రమాదం సంభవించడంతో బయటకు వస్తున్న కార్మికులు

మల్కాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

హెచ్‌పీసీఎల్‌లోని యూనిట్-1లో శుక్రవారం ఉదయం పైప్‌లైన్ నుంచి హైడ్రోజన్ లీకై మంటలు చెలరేగడంతో వేలాది మంది కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. ఉదయం తొమ్మిది గంటల సమయంలో పెద్ద శబ్దం రావడంతో పారిశ్రామిక ప్రాంతం ఉలిక్కిపడింది. అయితే మంటలను అదుపు చేశారని తెలియడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదానికి కారణం మానవ తప్పిదమా, లేక సాంకేతిక సమస్య వల్ల ఉత్పన్నమైందా...అనే దానిపై సంస్థ అధికారులు విచారణ జరుపుతున్నారు. కార్మికులెవరూ గాయపడలేదని, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

ఘటనా స్థలానికి తహసీల్దార్

ప్రమాద స్థలాన్ని ములగాడ

... మిగతా 6వ పేజీలో

ఉద్యోగుల చేతుల్లోనే స్టీల్‌ప్లాంటు భవిష్యత్తు

- మిగిలిన కర్మాగారాలతో పోల్చితే విశాఖ ఉక్కు పనితీరు భేష్
- నష్టాల నుంచి బయటపడేందుకు రోజుకు కనీసం 19 వేల నుంచి 21 వేల టన్నుల ఉత్పత్తి సాధించాలి
- అక్టోబరు నుంచి పూర్తి జీతాలు
- ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీ సందీప్ పాండ్రిక్



మాట్లాడుతున్న ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీ సందీప్ పాండ్రిక్

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

స్టీల్‌ప్లాంటును ఉద్యోగులే కాపాడుకోవాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సెక్రటరీ సందీప్ పాండ్రిక్ అన్నారు. శుక్రవారం ప్లాంటు సందర్శనకు వచ్చిన ఆయన సుమారు రెండు వందల మంది ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ దేశంలో మిగిలిన స్టీల్‌ప్లాంట్ల కంటే విశాఖ స్టీల్‌ప్లాంటు పనితీరే బాగుందని ప్రశంసించారు. కొన్ని నిర్ణయాలు తమ చేతుల్లో లేవని, అయితే ప్లాంటు భవిష్యత్తు కోసమే కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఏడాది కాలంలో మూడుసార్లు మంత్రిత్వశాఖ అధికారులు వచ్చారంటే స్టీల్‌ప్లాంటుపై కేంద్ర ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉన్నదో ఆలోచించాలన్నారు. గత ఏడాది ఆగస్టులో ముడి సరకుల కొరత, అప్పుల భారంతో ప్లాంటు మూసివేత దశకు చేరుకున్నదని, ఉద్యోగుల కృషితో నేడు మళ్లీ మంచి స్థితికి చేరిందన్నారు. కానీ సమస్యలు ఇంకా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 11,440 కోట్లు బ్యాంకుల అప్పులు తీర్చడానికి వినియోగించారన్నారు. మరో 36,000 కోట్లు అప్పు ఉందన్నారు.

రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో నడిపినప్పుడు లాభాలు వచ్చాయని, ఇప్పుడు మూడు ఫర్నేస్‌లు 72 శాతం సామర్థ్యం (రోజుకు 16 వేల టన్నులు)తో నడపడం వల్ల నష్టాలు వస్తున్నాయన్నారు. నష్టాల నుంచి బయటపడేందుకు రోజుకు కనీసం 19 వేల నుంచి 21 వేల టన్నుల ఉత్పత్తి సాధించాలన్నారు. ఉక్కు ధరలు 2021లో టన్నుకు 65 వేల నుంచి 70 వేలు ఉండగా, ఇప్పుడు 45 వేల కంటే తక్కువ ఉందన్నారు. ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.38-39 వేలు అవుతుందన్నారు. ఇది వర్షాకాలం కావడంతో ఉక్కు అమ్మకాలు తగ్గాయని, అక్టోబరు నెల నుంచి మళ్లీ పుంజుకుంటాయన్నారు. అప్పుడు టన్ను ఉక్కు 80 వేలకు చేరే అవకాశం ఉందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటుకు

... మిగతా 6వ పేజీలో

కల్తీ నెయ్యి ముఠా గుట్టు రట్టు

- టాస్క్‌ఫోర్స్, ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారుల దాడులు
- 120 కిలోలు స్వాధీనం... ముగ్గురి అరెస్టు



కల్తీ నెయ్యి సీసాలు



నెయ్యిని కల్తీ చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

కల్తీ నెయ్యి తయారుచేస్తున్న ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు శుక్రవారం రట్టు చేశారు. వివరాల్లోకి వెళితే...పూర్ణామార్కెట్ ప్రాంతంలోని విశ్రాంత్ లాడ్జిలోని రూమ్ నంబర్ 109లో బళ్లారి కి చెందిన ముగ్గురు కల్తీ నెయ్యి తయారుచేస్తున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆహార భద్రతా ప్రమాణాల శాఖ అధికారులతో కలిసి లాడ్జిపై దాడి చేశారు. ఆ సమయంలో అక్కడ పెద్దఎత్తున కల్తీ నెయ్యి తయారు చేస్తుండడాన్ని

... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీ దసరా స్పెషల్స్ 300

- హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు 100
- శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, పలాస, విజయనగరం ప్రాంతాలకు 200
- స్పెషల్స్‌లోనూ సాధారణ చార్జీలే



ద్వారకా బస్‌స్టేషన్,
సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

దసరా స్పెషల్ సర్వీస్‌లుగా 300 బస్సులు నడపాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి వంటి దూర ప్రాంతాలకు 100, జోనల్ పరిధిలోని శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, విజయనగరం, బొబ్బిలి, సాలూరు వంటి ప్రాంతాలకు 200 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు ప్రణాళిక తయారుచేసింది. ఈనెల 22 నుంచి వీటిని నడపనున్నది. షెడ్యూల్ సర్వీస్‌లలో సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణికుల డిమాండ్ ఉంటేనే ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. స్పెషల్స్‌లోనూ సాధారణ చార్జీలు వసూలు చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

స్త్రీశక్తి ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండొచ్చు

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేసిన తరువాత ప్రయాణికుల సంఖ్య భారీ పెరిగిందని, దసరా రోజుల్లో మరింత సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని

... మిగతా 6వ పేజీలో

అప్పన్న ఆభరణాలపై నివేదిక సమర్పణ

సింహాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి):

వరాహ లక్ష్మీనృసింహస్వామికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన స్వర్ణ, రజిత ఆభరణాలకు సంబంధించిన సమగ్ర నివేదికను ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ దేవదాయ శాఖ మల్టీ జోన్-1 రీజినల్ జాయింట్ కమిషనర్ వేండ్ర త్రినాథరావుకు అందజేసింది. ఆభరణాల విషయంలో వ్యత్యాసాలు ఉన్నట్టుగా కడపకు చెందిన స్వచ్ఛంద సేవా కార్యకర్త ప్రభాకరాచారి జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు ఆర్‌జేసీ ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించారు. వారు సుమారు 15 రోజుల పాటు ఆలయ అర్చకుల వద్ద, భాండాగారంలో, ఉపాలయాల్లో, సింహాచలం జాతీయ బ్యాంకులోని ఆభరణాలను ప్రత్యక్షంగా తనిఖీ చేసి, రికార్డులతో సరిపోల్చిన తరువాత నివేదికను రూపొందించి ఆర్‌జేసీకి అందజేశారు. ఆయన దానిని దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు దానిని సమర్పించారు.

'వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

పద్మనాభం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వరిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని భీమిలి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ బి.వి జయప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవసరమైన మేరకు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలతోనే ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. వరిపంటలో ప్రస్తుతం పొడ తెగులు కనిపిస్తోందన్నారు. దీని నివారణకు ఎకరానికి ఎసిఫేట్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలన్నారు. దీంతో పాటు హెక్సాకొనజోల్ లీటరు నీటికి 2మిల్లీలీటర్లు కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలన్నారు. వరిపంటకు పొట్టదశలో 20 కేజీల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలన్నారు.

చిరు వ్యాపారులపై జీవీఎంసీ విధానం సరికాదు

- ఉన్నపళంగా దుకాణాలు తొలగిస్తే వారు బతికేదెలా?
- తప్పుపట్టిన సీపీఐ
- ప్రత్యామ్నాయం చూపాలంటూ డిమాండ్



సమావేశంలోమాట్లాడుతున్న కానూరి రాంబాబు, పాల్గొన్న సీపీఐ నేతలు

తగరపువలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించి వారి పొట్టకొట్టేలా వారి దుకాణాలను తొలగించడం జీవీఎంసీకి న్యాయం కాదని భీమిలి ఏరియా సీపీఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం భీమిలి జోనల్ కమిషనర్, సహాయ పట్టణ ప్రణాళికాధికారి ఆధ్వర్యంలో దుకాణాలను తొలగించడాన్ని సీపీఐ తప్పు పట్టింది. శుక్రవారం చిట్టివలస సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా దుకాణాలను తొలగిస్తే చిరు వ్యాపారుల జీవనం పిల్లాపాపలతో ఎలా సాగేది అని ప్రశ్నించారు. ముందస్తుగా వ్యాపారులందరినీ కార్యాలయానికి పిలిచి ట్రాఫిక్‌కు కలుగుతున్న అంతరాయాన్ని వివరిస్తూ, వారు జీవన విధానానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి అక్కడకు గడువు నిర్ణయించి దుకాణాలు మార్చుకోవాలని సూచించడం సరైన విధానమని అభిప్రాయపడ్డారు. అకస్మాత్తుగా పోలీసులు, ఎక్సకవేటర్లు, వాహనాలను తీసుకొచ్చి దుకాణాలను తొలగించడం అన్యాయమన్నారు. ఇది చిరు వ్యాపారుల బతుకును ఛిన్నాభిన్నం చేయడమే అన్నారు. దుకాణాల తొలగింపుతో చిరు వ్యాపారుల ఆవేదన వర్ణనాతీతం అన్నారు. ఇప్పటికైనా అధికారులు సంబంధిత బాధిత చిరువ్యాపారులు బ్రతకడానికి తగిన ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో సిపిఐ ఏరియా కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, వీర్రాజు, ఆదినారాయణ, అప్పారావు, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భీమునిపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా విచ్చేసిన డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకర్‌ప్రసాద్, ఆయుష్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళలు-బలమైన కుటుంబానికి పునాది అనే ప్రధానోద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఈ వైద్య సేవల కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపర్చు కోవాలని కోరారు.

చంద్రంపాలెం పాఠశాలపై లోకేశ్ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

మైదానం ఎత్తు పెంచాలని చెబుతున్నారు. మరింత మట్టి తోలి రోలింగ్ చేయాల్సి ఉంటుందని ఇంజనీర్ ఒకరు పేర్కొన్నారు. ఈ విషయం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా మంత్రి లోకేశ్ ఆదేశాలతో చంద్రంపాలెం పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తాత్కాలికంగా ఏపీ మౌలిక వసతుల కల్పన సంస్థ కొంత వరకు మట్టివేసి చదునుచేస్తోందన్నారు. భవిష్యతులో మైదానం పక్కాగా ఉండాలంటే మరిన్ని నిధులు అవసరమన్నారు. ఇంజనీరింగ్ నిపుణులతో ప్రతిపాదన తయారుచేయించి కలెక్టర్‌కుసమర్పిస్తామన్నారు.

లక్ష్యసాధనతోనే బంగారు భవిష్యత్తు

- భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ
- ఘనంగా అవంతి పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న మురళీకృష్ణ, అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ తదితరులు

తగరపువలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యసాధనతోనే బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోగలమని భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం తగరపువలసలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మురళీకృష్ణ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రపంచంతో పోటీ పడి నైపుణ్యం సాధించే విధంగా కోర్సులను అభ్యసించాలన్నారు. ముఖ్యంగా చదువుతో పాటు విలువలను కలిగిన్న విద్యార్థులకు మాత్రమే గౌరవం లభిస్తోందని గుర్తుంచుకోవాలన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి టెక్నికల్ స్కిల్స్ సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జిపై దృష్టి సారించాలన్నారు. బోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిస కాకూడదని, క్రమశిక్షణతో చదివి మంచి భవిష్యత్తును పొందాలన్నారు. తొలుత అతిథులు జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.జగదీశ్వరరావు, విభాగాధిపతి శేషు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

ఆనందపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థిక భరోసా కల్పించేందుకు శ్రీసత్యసాయి సేవా సంస్థలు రాష్ట్రంలోని మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచితంగా టైలరింగ్, ప్యాషన్ డిజైనింగ్ అంశాల్లో శిక్షణను అందిస్తున్నట్టు స్టేట్ స్కిల్ డెవలఫ్‌మెంట్ మహిళా కో-ఆర్డినేటర్ డి.అమ్మాజీ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొట్టిపల్లిలో శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్ జోన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో 55 మంది మహిళలకు ఉచితంగా టైలరింగ్ అండ్ ప్యాషన్ డిజైనింగ్‌లో 40 రోజలశిక్షణాతరగతులను ఆమె ప్రారంభించారు.

దస్తావేజు లేఖరుల నిరసన


భీమిలి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ముందు నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

భీమునిపట్నం/ మధురవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాలను వ్యతిరేకిస్తూ భీమిలిలో శుక్రవారం దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ నిర్వహించారు. ఉదయం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేశఆరు. ఆధార్ ఓటీపీ స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ జఠిలమవుతోందని అన్నారు. ఈ కారణంగా డాక్యుమెంట్ తయారీకి తీవ్ర జాప్యం జరగడంతో ఇటు ప్రజలు, అటు డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఈ విధానంలో మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ నిరసన తెలియజేస్తున్నట్టు దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు బి.లక్ష్మి, ఎన్.గోవింద్, భాను ప్రకాష్, శ్రీనివాస్, సుబ్రమణ్యం, డి.గోవింద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం యూటీఎఫ్ రణభేరి

ఆనందపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ కోసం విద్యార్థులు, సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు రణబేరి బైక్ జాతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆనందపురం జంక్షన్‌లో రణబేరి బైక్ జాతరను చివరిరోజు డప్పు మోగించడం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తం గా ఐదు కేంద్రాల్లో రణభేరి ప్రచార జాత నిర్వ హిస్తున్నట్టు తెలిపారు.గత ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఒప్పందంలో భాగంగా సాల్ట్ పథకాన్ని విద్యారంగంలో తీసుకొచ్చి పాఠశాల విద్యావ్యవస్థను విచ్చిన్నం చేసిందని, అదే సాల్ట్ పథ కాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని విమర్శించారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నాణ్యత, ప్రవేశాలుపెరగకపోగా తగ్గుదల కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే దీనికి కారణం ఉపాధ్యాయులు సరిగా బోధన చేయడం లేదని చెప్పడాన్ని యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన కొద్ది రోజుల్లోనే యోగాంధ్ర వారం రోజులు, మెగా పీటీఎం పేరుతో 15 రోజులు, కర్మయోగి పి4 యాప్ అన్ని అప్లోడ్ చేసుకోవడాలు, సమాచారాన్ని అధికారులకు పంపిండంతోనే పాఠశాలల సమయం మొత్తం హరించుకుపోతోందన్నారు. ఇలాంటి తరుణంలో పిల్లలకు నాణ్యమైన విద్య ఒక అక్షరం కూడా చెప్పే అవకాశం ఈ ప్రభుత్వం ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రపంచ బ్యాంకుకు గణాంకాలు ఇవ్వడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన వస్తుందా? అని సూటిగా ప్రశ్నించారు. పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను తీవ్రంగా కించపరుస్తున్నటువంటి అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. బోధనకు మాత్రమే పరిమితం చేయాల్సిన ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల చుట్టూ తిప్పుతూ ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలు బయటకు వెళ్లడానికి కారణం ప్రభుత్వం, ప్రభుత్వ విద్యాశాఖ అధికారులేనని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కిశోర్, శ్రీలక్ష్మి, పూర్వ రాష్ట్ర సహాయాధ్యక్షులు కోరేంట్ల విజయ గౌరి, జిల్లా దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్, గౌరవాధ్యక్షులు పైడిరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ దసరా స్పెషల్స్ 300

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. దసరా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్టీసీ రీజనల్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, ట్రాఫిక్ మేనేజర్లు, కంట్రోలర్లు అప్రమత్తంగా ఉండాలని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి సమయాల్లో కూడా ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ఉలిక్కిపడిన పారిశ్రామిక ప్రాంతం

... 5వ పేజీ తరువాయి

మండల తహశీల్దార్ రమేష్‌నాయుడు, ఆర్ఐ దివ్య సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్రెసర్ స్టార్ట్ చేసినప్పుడు అక్కడ కేవలం నలుగురు కార్మికులు మాత్రమే ఉన్నారని, వారు కూడా ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారని తెలిపారు.

భద్రత లేదు: సీఐటీయూ

నూతనంగా నిర్మిస్తున్న యూనిట్‌లో కార్మికులకు భద్రత లేదని సీఐటీయూ నాయకుడు లక్ష్మణమూర్తి ఆరోపించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న యూనిట్‌లో ఇంకా పనులు కొనసాగుతుండగానే చమురు శుద్ధి పనులు మొదలుపెట్టేశారని ఆరోపించారు. అంత భారీపేలుడు సంభవించినప్పటికీ అధికారులు సైరన్ మోగించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యం కార్మికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ప్రస్తావించారు. గురువారం నాటి ఘటన విమానాశ్రయ పరిసరాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని విమాన ప్రయాణికులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టులోనే విమానం

పక్షి ఢీకొన్న ఘటనలో మరమ్మతులకు గురైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రస్తుతం విశాఖ విమానాశ్రయంలోనే ఉన్నట్టు సమాచారం. దానికి సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిసింది.

కల్తీ నెయ్యి ముఠా గుట్టు రట్టు

... 5వ పేజీ తరువాయి

గమనించారు. వివిధ కంపెనీలకు చెందినసన్‌ఫ్లవర్ ఆయిల్‌లో బళ్లారి నుంచి తెచ్చిన క్రీమ్స్‌ను కలిపి నెయ్యి మాదిరి తయారు చేస్తున్నట్టు, వాసన రావడానికి కొన్నిరకాల రసాయనాలను వినియోగిస్తున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు గుర్తించారు. కల్తీ నెయ్యిని కిలో రూ.350 చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో ఫంక్షన్లకు కేటరింగ్ చేసే సంస్థలకు విక్రయిస్తున్నట్టు తేల్చారు. కల్తీ నెయ్యి తయారుచేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న బళ్లారికి చెందిన లక్ష్మీపతి, శ్రీధర్, రాజశేఖర్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు. తయారుచేసిన 120 కిలోల కల్తీ నెయ్యిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించనున్నట్టు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్.ఐ. భరత్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల శుక్రవారం తిరువీధి


తిరువీధిలో ఊరేగుతున్న అమ్మవార్లు

సింహాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సింహవల్లీ తాయార్, సువర్ణ అమ్మవార్ల తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బంగారు తొళ్లక్కియాన్‌లో ఉంచారు.ఆలయ ఆస్థాన విద్వాంసుల సునాద నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడు మ బేడా మండపంలో తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు.భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కమనీయం అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. దానిలో భాగంగా శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. షోడశోపచారాలు సమర్పించాక పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేశారు. మాంగల్య సమర్పణలు చేసి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చారు.

160 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం నేపథ్యంలో మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కుర్రపల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బీజేపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 160 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, నీరుడు, రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు కూడా ప్రత్యేకంగా సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ భార్గవ్, డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ తేజప్రభు, సింధు, హిమజ తదితరులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు టి.నాగమణి, కృష్ణారావు, సోమేశ్వరరావు, వెంకటరావు, హంస మహేష్, గౌరిరెడ్డి పాల్గొన్నారు.

చిరు వర్తకులకు ఉపాధి కల్పించాలని డిమాండ్


మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద చిరువర్తకుల నిరసన ర్యాలీ

మధురవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిథిలాపురి వుడాకాలనీ ప్రధాన రహదారికి ఇరువైపులా తొలగించిన దుకాణాల యజమానులకు జీవనోపాధి కల్పించాలని బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీటీయూ ఆధ్వర్యంలో వుడాకాలనీ నుంచి మధురవాడ జోనల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మధురవాడ సర్వీస్‌రోడ్డుపై కొద్ది సేపు వర్తకులు బైఠాయించారు. సీఐటీయూ మధురవాడ జోన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్‌లు మాట్లాడుతూ వీధి విక్రయదారుల చట్టాలు అమలుపరచకపోవడంతో వ్యాపారులు వీధిన పడుతున్నారని అన్నారు. రోడ్డుపక్కన బతుకుతెరువుకోసం వ్యాపారాలు చేసుకుంటున్న వారిపై జులుం చెలాయించడాన్ని ఖండిస్తున్నామన్నారు. మధురవాడలోని ప్రతీ ప్రధాన కూడలిలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి చిరువర్తకులను ఆదుకోవాలని సిటు నాయకులు కోరారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ అధికారులు పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించడం అన్యాయమన్నారు. వెంటనే వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

తూతూమంత్రంగా తొలగింపు


రుషికొండలో పాక్షికంగా తొలగించిన వాణిజ్య సముదాయం

సాగర్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డుకు ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాణిజ్య సముదాయాలను శుక్రవారం మధురవాడ జోన్ టు పట్టణ ప్రణాళికా అధికార్లు తొలగించడానికి వచ్చి వెనుతిరిగారు. ఇక్కడ పలు వాణిజ్య సముదాయాల ఏర్పాటు పట్ల వివాదం నెలకొంది. దరిమిలా కోర్టు తీర్పు జీవీఎంసీకి అనుకూలంగా రావడంతో వాణిజ్య సముదాయాన్ని నేలమట్టం చేయడానికి జోన్‌టు పట్టణా ప్రణాళికా విభాగం అధికార్లు జేసీబీలను తీసుకు వచ్చారు. తొలుత చిన్నచిన్న ఫ్యాబ్రికేట్ సామాన్లు తొలగించారు. ఇంతలో అధికారులకు ఒత్తిడి రావడంతో జేసీబీని ఉన్నట్టుండి వెనక్కి పంపేశారు. చిన్న చిన్న బడ్డీలను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్న అధికారులు, పలుకుబడి గలవారి వాణిజ్య సముదాయాల జోలికి వెళ్లకపోవడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగుల చేతుల్లోనే స్టీల్‌ప్లాంటు భవిష్యత్తు

... 5వ పేజీ తరువాయి

ప్రధానంగా ముడి సరకులు కొరత ఉందని, ఇంకా మూడున్నర దశాబ్దాల కిందట కర్మాగారం కావడంతో నిర్వహణపరమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాటి పరిష్కారంలో సిబ్బంది సహకారం చాలా అవసరమన్నారు. కొందరూ స్టీల్‌ప్లాంటు ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, దయచేసి అలాంటి పనులకు పాల్పడవద్దన్నారు. సీఎండీ సహా ఉన్నతాధికారులంతా కొద్దిరోజులు మాత్రమే ఇక్కడ ఉంటారని, ఆ తరువాత వెళ్లిపోతారని, శాశ్వతంగా ఉండేది ఉద్యోగులు మాత్రమేనన్నారు. కాబట్టి వారే ప్లాంటు పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మూడు ఫర్నేస్‌లను వంద శాతం సామర్థ్యంతో నడపాలన్నారు. టీమ్ వర్క్, ఎవరు ఎక్కడైనా పనిచేసేలా అన్నింటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంటు భూముల అమ్మకంపై అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఉద్యోగులకు అక్టోబరు నుంచి వంద శాతం జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అన్నీ కుదుటపడి ప్లాంటు పూర్వస్థితికి వస్తే మళ్లీ ప్రమోషన్‌లు ఇస్తామని భరోసా ఇచ్చారు.

దుర్గాలమ్మ అమ్మవారి దసరా ఉత్సవాల పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉత్సవాల కమిటీ ప్రతినిధులు

కొమ్మాది, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చంద్రంపాలెం దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 22 న అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. ప్రతిరోజు అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సుగంధ జలాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవరాత్రులలో ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు కుంకుమపూజలు, హోమం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 29న మూలా నక్షత్రం సందర్భంగా మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లాచంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, సెక్రటరీ నాగోతి తాతారావు, జగ్గుపల్లినాని, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పోషణలో తండ్రి పాత్ర ఉండాలి

ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి సూచన


పోషకాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

సింహాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల పోషణలో తల్లితోపాటు తండ్రి పాత్ర కూడా తప్పనిసరిగా ఉండాలని ఐసిడిఎస్ సీడీపీవో ఎం.శ్రీదేవి అన్నారు. రాష్ట్ర 8వ పోషణ మాసోత్సవాలలో భాగంగా మహావిశాఖ 98వ వార్డు బంగారమ్మ గుడి సమీప అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లల ఆహారపు అలవాట్లు, పోషకాహారం, బరువు పెరగకుండా తీసుకోవలసిన బాధ్యతలను విశదీకరించి వాటిని అమలు చేయటంలో పురుషులు తమ అర్ధాంగులకు సహకరించాలన్నారు. అత్యధిక పోషక విలువల ఆహారాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు ఎ.వెంకటలక్ష్మి, ప్రమీలారాణి, కనకమహాలక్ష్మి, ఆశాకార్యకర్త వి.సునీత, హెల్త్ సూపర్‌వైజర్ కె.నరసయ్యమ్మ పాల్గొన్నారు.

ఉద్రిక్తం

... 5వ పేజీ తరువాయి

ఆపివేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ దల్లిగోవిందరాజుతోపాటు దక్షిణ నియోజకవర్గానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని డీసీపీ హరిదాసుతో చర్చించారు. శుక్రవారం రాత్రి మరోసారి దుకాణాలు తొలగింపునకు అధికారులు సమాయత్తమవ్వడంతో కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించడం ప్రారంభించారు.

ఫుడ్‌కోర్టు తొలగింపు హేయమైన చర్య

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన నైట్ ఫుడ్‌కోర్టు తొలగింపు హేయమైన చర్య అని ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేనైన తనకు కనీసం సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌కు లేదా? అని ప్రశ్నించారు. ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని వారిద్దరే నిర్ణయించుకుని వ్యాపారులకు కూడా నోటీసు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఫుడ్ కోర్టు అంశాన్ని మరోసారి కౌన్సిల్‌లో చర్చకు పెడితే మెజారిటీ చూపించుకోవచ్చునన్నారు. అధికారులు చేసిన పని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఊరుకునేది లేదన్నారు. ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఒక్కసారి రోడ్డునపడేయడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానన్నారు. వ్యాపారులకు కార్డులు జారీ చేసి అద్దె నిర్ణయిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు.

కౌన్సిల్ తీర్మానం ప్రకారమే తొలగింపు

నైట్ ఫుడ్‌కోర్టును తొలగించాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో చేసిన తీర్మానానికి అనుగుణంగానే తాము చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న ఫుడ్‌కోర్టు వల్ల జీవీఎంసీకి కనీసం ఆదాయం రాకపోగా, ట్రాఫిక్‌కు, పరిశుభ్రతకు ఇబ్బందికరంగా ఉంటోందన్న ఫిర్యాదులు ఎక్కువగా అందుతున్నాయన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఫుడ్‌కోర్టు ఒక్కటే కాకుండా నగరంలో అన్నిచోట్ల ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. టౌన్ వెండింగ్ కమిటీ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిని గుర్తించి వారికి దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తామన్నారు.

గీతంలో మెగా రక్తదాన శిబిరం


. రక్తదానం చేస్తున్న వలంటీర్లు

సాగర్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు వెయ్యిమంది వలంటీర్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్టీఆర్, ఎ.ఎస్.రాజా, రోటరాక్ట్, మదర్, జిమ్‌సర్ బ్లడ్‌బ్యాంక్‌ల నుంచి నిపుణులు విచ్చేసి విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి.రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్‌లు సత్యనారాయణ, కె.సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. శివాజీ ఆడిటోరియం, మదర్ థెరిసా ఆడిటోరియం, నాలెడ్జి రీసోర్సు సెంటర్‌లలో సాయంత్రం వరకు కొనసాగిన రక్తదాన శిబిరంలో ఔత్సాహికులు బారులు తీరారు. విద్యార్థుల సేవానిరతిని అధికారులు అభినందించారు.

నగరంపాలెం శ్మశానం ప్రహరీ గోడకు రక్షణ

మధురవాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 7 వ వార్డు నగరంపాలెం శ్మశానవాటిక ప్రహరీకి అధికారుల చర్యతో రక్షణ ఏర్పడింది. నగరంపాలెం సచివాలయం నుంచి వాంబేకాలనీకి వేస్తున్న రహదారి కోసం శ్మశానవాటిక ప్రహరీకి ఆనుకొని ఉన్న గ్రావెల్‌ను తవ్వి తీయడంతో గోడ కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ సమస్యను సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు వీఎంఆర్డీఏ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కమిషనర్ వెంటనే స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌ను శ్మశానవాటిక గోడవద్ద గ్రావెల్ తవ్వవద్దని ఆదేశించారు. గోడచుట్టూ రక్షణగా గ్రావెల్‌ను వేయాలని ఆదేశించారు.

భలేభలే అందాలు..

రైతు బజార్‌లో చెట్లపై చిత్రాలు

» ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల సృజనాత్మకత
» ఆకర్షణీయంగా బజార్ ప్రాంగణం


రంగులతో ముచ్చట గొల్పుతున్న చెట్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజారు కొత్త హంగులతో స్వాగతం పలుకుతోంది. స్వచ్ఛసంరక్షణ్‌లో భాగంగా రైతు బజార్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులతో వృక్షాలను అందంగా తీర్చిదిద్దారు. వాటికి ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. బజార్ మధ్యలో ఉన్న మర్రి చెట్టును ఏకంగా భూతంగా మార్చేశారు. అది చూసి కొందరు జడుసుకుంటుంటే, మరికొందరు చిత్రలేఖనానికి ముచ్చటపడుతున్నారు. బజార్‌లోని చెట్లకు వర్ణాలద్ది, విద్యార్థులు శెభాష్ అనిపించుకున్నారు.

ఓ కొబ్బరి చెట్టుకు ఏడు రంగులు, ఇతర చెట్లకు పలు రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ సూచనల మేరకు ఈ చిత్రాలను వేయించినట్టు బజార్ ఎస్టేటు అధికారి వరహాలు తెలిపారు.

మొత్తం మీద చెట్లను ఆకర్షణీయంగా తయారు చేయించి, వినియోగదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు.


బజార్ ఆవరణలో రంగురంగుల చిత్రాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వృక్షాలు


మర్రిమానుపై బేతాళుడు

భీమిలిలో మహిళా ప్రత్యేక సెజ్

» అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన భీమిలి ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా భీమిలి నియోజకవర్గంలో మహిళా స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభుత్వాన్నికోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో ప్రత్యేక మహిళా సెజ్ కోసం 50 ఎకరాలను ప్రభుత్వం గుర్తించడం జరిగిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సంబంధిత భూమిలో జగనన్న కాలనీ నిర్మించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ (ఏఎల్ఈఏపీ) తెలంగాణలోని గాజులరామారం, విజయవాడ సమీపంలో సూరంపల్లి ప్రాంతాలలో ఇప్పటికే ఆ అసోసియేషన్ ప్రత్యేక మహిళా పారిశ్రామికవాడలను నిర్వహిస్తోందన్నారు. భీమిలి నియోజకవర్గ గ్రామీణ మహిళలు ఉదయం 6 గంటల నుంచి కనీస వేతనాల కన్నా తక్కువ వేతనానికి (రు.పదివేలు నుంచి రు. 12వేలు) సుదూర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. విశాఖ నుంచి అత్యధికముగా మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, మహిళా భద్రతలో దేశంలోనే విశాఖ ప్రథమ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ప్రశంసించారన్నారు. టెక్స్‌టైల్స్, ఫ్యాషన్, జ్యువెలరీ, ఆరోగ్య రంగాల్లో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. శరవేగంగా అభివృద్ధిచెందుతున్న విశాఖలో టూరిజం, ఐటీ రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రత్యేక మహిళా సెజ్‌ను మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం సెజ్‌లు మంజూరు చేయడం లేదని మంత్రి సమాధానం చెప్పారని, అయితే, సెజ్ పేరుతో కాకుండా మహిళా పారిశ్రామికవాడ గానో, వేరే పేరుతోనైనా ప్రాజెక్టు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గంటా కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయ 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వాహణ, చెట్ల నరికివేత లైన్ల మరమ్మతు పనులు చేపడుతుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. ఇందిరానగర్, ఆదర్శనగర్, సుందర్ నగర్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీధి దీపాలకు మరమ్మతులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో వీధి దీపాలను విద్యుత్ శాఖ వారు శుక్రవారం బాగుచేశారు. కొన్ని చోట్ల కొత్త దీపాలను అమర్చారు.


మరమ్మతు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

అన్న క్యాంటీన్ ఏడాది పండుగ


కేకు కట్ చేసి ఆనందం పంచుకుంటున్న ధర్మారావు, పాల్గొన్న టీడీపీ నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల కనక మహాలక్ష్మి నగర్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ నేతలు కేకును కట్ చేసి ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు, 13వ వార్డు తెలుగు మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి, క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి, ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. భోజనాలకు వచ్చిన వారికి కేకును పంచి పెట్టారు.

చోడే పట్టాభికి టీడీపీ నేతల అభినందనలు


పట్టాభిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు రమేష్‌రెడ్డి, గుడ్ల గోవింద్‌రెడ్డి తదితరులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడుగా నియమితులైన చోడే వెంకటపట్టాభిని శుక్రవారం టీడీపీ 23వ వార్డు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభిని టీడీపీ సీనియర్ నాయకులు అచ్చి రమేష్‌రెడ్డి తదితరులు సన్మానించారు. ఆయనతో పాటు టీడీపీ కార్యదర్శి గుడ్ల గోవింద్‌రెడ్డి పట్టాభికి అభినందనలు తెలిపారు.

మత్స్యకారులు తప్పనిసరిగా టెడ్ వినియోగించాలి

» మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు


మత్స్యకారులకు టెడ్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి. లక్ష్మణరావు

బీచ్ రోడ్డు, సెప్టెంబర్ 19, (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు తప్పనిసరిగా టెడ్ వాడాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం నెట్‌ఫిష్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ వద్ద డాల్ఫిన్ బోట్ ఆపరేటర్స్ సంఘం ఆధ్వర్యంలో తాబేళ్లు తప్పించే పరికరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెడ్ పరికరం ట్రాల్ వలలో అనుకోకుండా తాబేళ్లు చిక్కుకున్నప్పుడు తప్పించుకోవడానికి వీలు కల్పిస్తుందని, తాబేళ్ల పరిరక్షణ దృష్ట్యా బోటు యజమానులు చేపల వేట చేసే ట్రాల్ వలలో విధిగా ఈ పరికరాన్ని వాడాలని చెప్పారు. ఈ టెడ్ పరికరం ఒక్కొక్కటి సుమారు రూ.20 వేలు విలువ ఉంటుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 100 శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే వంద శాతం రాయితీపై బోట్లకు సరఫరా చేసిన ట్రాన్స్‌పాండర్స్‌ను తప్పక వినియోగించాలని చెప్పారు.

నెట్‌ఫిష్ కో-ఆర్డినేటర్ హనుమంతురావు మాట్లాడుతూ సముద్ర రొయ్యల దిగుమతి కోసం అమెరికా దేశం ఈ టెడ్ వినియోగాన్ని తప్పనిసరి చేసిందని తెలిపారు. రొయ్యలు ఎగుమతి చేయడానికి టెడ్ వినియోగం తప్పక వాడాలని వెల్లడించారు. టెడ్ వినియోగం వల్ల చేపలు, రొయ్యలు తప్పించుకొనే అవకాశం ఉందని తెలిపారు. టెడ్ వినియోగం వల్ల ఇంధనం ఆదా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ మహంతి, డాల్ఫిన్ బోట్‌యాజమానుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వీర్రాజు, నరసమ్మ, బోటు యజమానులు పాల్గొన్నారు.

అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు
ఈసీ రీసెర్చి సెంటర్

తగరపువలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగానికి రీసెర్చ్ సెంటర్‌కు జేఎన్టీయూ, జీవి ఆమోదం తెలిపింది. విజయనగరం జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మీ, రిజిస్ట్రార్ జి.జయసుమ, డైరెక్టర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు సంబంధిత అనుమతి పత్రాలను అవంతి కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ విభాగాధిపతి జి.అనంత్‌రావు, కో-ఆర్డినేటర్ శంకరరావులకు అందజేశారు. దీనిపై అవంతి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

కాలువలు శుభ్రపరిచిన పారిశుధ్య సిబ్బంది



కాలువను సరిచేయిస్తున్న ఏఎంవోహెచ్ దుర్గాప్రసాద్, శానిటరీ సిబ్బంది

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు చివర ఉమానగర్ ప్రాంతంలో కాలువ మూసుకుపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైకి వస్తుందంటూ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జోన్-3 ఏఎంవోహెచ్ దుర్గాప్రసాద్, శానిటరీ సిబ్బంది శుక్రవారం ఉదయం పరిశీలించి, వీధి కాలువ చివర పేరుకుపోయిన మట్టిని తొలగించడంతో పాటు కల్వర్టు కింద ఉన్న కాలువను కూడా శుభ్రం చేయడంతో మురుగునీరు సజావుగా ముందుకు సాగుతోంది. గత కొద్ది కాలంగా ఉన్న సమస్యను పరిష్కరించనందుకు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, జీవీఎంసీ అధికారులు, శానిటరీ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

చేయి కోసుకున్న అర్బన్ పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్

» కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపులే కారణమని ఆరోపణ


స్టాఫ్‌నర్స్ పూజిత

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ (యూపీహెచ్‌సీ)లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న పూజిత చేయి కోసుకోవడం ఆందోళన కలిగించింది. దీనికి కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వేధింపులే కారణమని ఆరోపించడం సంచలనం సృష్టించింది. పీతలవానిపాలెం యూపీహెచ్‌సీలోఏడుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. రామ్‌నగర్ వైద్యురాలిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. అయితే సిబ్బంది ప్రతిరోజూ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. దీంతో కార్పొరేటర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం యూపీహెచ్‌సీని కార్పొరేటర్ సందర్శించేసరికి సిబ్బంది ఎవరూ లేరు. రేసపువానిపాలెంలో వైద్య శిబిరానికి హాజరయ్యారని చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నోడల్ అధికారి వచ్చి పరిశీలించి, సిబ్బంది విధులకు గైర్హాజరు అయినట్టు రికార్డు చేశారు. అయితే తాను విధుల్లోనే ఉన్నప్పటికీ తనకు గైర్హాజరు వేయడాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురైన స్టాఫ్‌నర్స్ పూజిత చేయి కోసుకుంది. అనంతరం సిబ్బందితో కలిసి డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసింది. ఇది తెలిసిన కార్పొరేటర్ అక్కడికి వెళ్లారు. అయితే విషయం పెద్దది కాకుండా రాజీ పడాలని ఇరువర్గాలకు అధికారులు సూచించినట్టు సమాచారం.

త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ డీఎస్పీలు


మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ డీఎస్పీలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ట్రైనీ డీఎస్పీల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్, శాంతిభద్రతలు, క్రైం ఫిర్యాదులపై కేసులు ఏ విధంగా నమోదు చేస్తారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానాలు, రోడ్డు ప్రమాదాలపై కేసుల నమోదు అంశాలను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ సతీష్ వివరించారు. శాంతిభద్రతలపై ఏఎస్ఐ గోవింద్ వివరించారు. ఏఎస్ఐ సతీష్ వివరించిన తీరుకు ముగ్ధులైన డీఎస్పీలు ఆయనకు బహుమతి అందజేశారు.

ఏయూలో కబడ్డీ పోటీలు ప్రారంభం



ఏయూ వీసీ రాజశేఖర్, అధికారులతో క్రీడాకారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్శిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ, ఖో-ఖో పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఈ పోటీలను ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ కాలేజీలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. శతాబ్ది ఉత్సవాల క్రీడల్లో ఏయూ అనుబంధ కాలేజీలు విద్యార్థులు విరివిగా పాల్గొనాలన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్. విజయ్‌మోహన్ మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన అనుబంధ కాలేజీలు నుంచి ఐదు వందల మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. 35 క్రీడా జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ప్రొఫెసర్ ఎ.పల్లవి, ఐఏపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, గొన్నా కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పీడీ కరుణాకర్, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగు భాషకు పెద్దపీట వేసేవరకు ఉద్యమం

» తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో నిరసన


తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తెలుగుదండు నాయకులు, ఏయూ తెలుగు విభాగం విద్యార్థులు, పలువురు సాహిత్రీపియులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషకు పెద్దపీట వేసే వరకు ప్రజా ఉద్యమం చేపడతామని తెలుగుదండు వ్యవస్థాపకుడు సూరి తెలిపారు. తెలుగుదండు ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కూడలిలో ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి నివాళులు అర్పించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ తెలుగు భాష రక్షణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట త ప్పిందన్నారు. అందుకే అమరావతిలోని అసెంబ్లీ ముందే ప్రజా ఉద్యయం నిర్వహించడానికి వెళ్తున్నామన్నారు. గాంధేయ మార్గంలో ఈ ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. తెలుగు భాషను ఇలాగే విస్మరిస్తే భవిష్యత్‌లో తెలుగు ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలుగు భాషాభిమానులు ఉద్యమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలుగులోనే ప్రాథమిక విద్యాబోధన, పదవ తరగతి వరకు ప్రథమ బాషగా తెలుగు ఉండాలని, పాలన వ్యవహారాలు తెలుగులోనే సాగాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఏయూ తెలుగు విభాగం విద్యార్థులు, సాహితీవేత్తలు సూర్యనారాయణ, మోహన్, సూరప్పడు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 3,4 జోన్ల పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ దొండపర్తి 33/11 కేవీ, టీఎస్సార్ సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, జోన్-3,4 పరిధిలో పలు ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం ఏర్పడుతుదని జీవీఎంసీ మంచినీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-3 పరిధిలో గల వార్డు 19లోని లాసన్స్‌బే కాలనీ, పెద్ద జాలరిపేట, 21వ వార్డులో చినవాల్తేరు, పెద్దవాల్తేరు, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం, 23వ వార్డులో కేఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, చైతన్య నగర్, కృష్ణా కళాశాల రోడ్డు, సీతమ్మపేట ప్రాంతంలోని, 27వ వార్డులోని శ్రీనగర్, ద్వారకానగర్, రామాటాకీస్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

సినిమా గైడ్

● **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
● **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
● **మదరాసి** : శ్రీకన్య
● **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
● **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
● **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
● **మహావతార్ నరసింహా** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 36, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 44, దేముడుచిక్కుడు 68, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

ద్విచక్ర వాహనాలలో పెట్రోలు చోరీలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ ఎమ్ఐ జి-సి-గృహసముదాయాలలో గురువారం అర్ధరాత్రి పలువురి ద్విచక్రవాహనాల నుంచి పెట్రోలు చోరీ జరిగింది. రాత్రి పూట సాగర్ నగర్ కాలనీలో పోలీసులు గస్తీ లేని సమయాలను చోరులు గమనించి ద్విచక్రవాహనాల నుంచి ఇంధనం చోరీకి పాల్పడుతున్నారు. సాగర్‌నగర్ పరిసర ప్రాంతాలలో క్రైమ్ పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఇంటి గడపల ముందు వదిలిన పాదరక్షలను సైతం వదలడం లేదని గగ్గోలు పెడుతున్నారు. చిల్లర దొంగతనాలపై ఆరిలోవ క్రైమ్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఎస్ఐ ఎ.హరికృష్ణ పరిశీలించి స్థానికులకు తగు జాగ్రత్తలు చెప్పారు. రాత్రివేళ గస్తీని కట్టుదిట్టం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనుమానితుల సమాచారం అందించాలని కోరారు. దసరా సెలవులకు ఇళ్లకు తాళాలు వేసి సొంతూళ్లకు వెళ్లేవారు తమకు ముందుగా సమాచారం ఇస్తే ప్రత్యేక రక్షణ కల్పిస్తామన్నారు.

అంతర్ కళాశాలల విలువిద్య పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల విలువిద్య (ఆర్చరీ) పోటీలు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో జరిగాయి. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఒలింపిక్స్ గుర్తింపు ఉన్న ప్రధాన క్రీడలలో విలువిద్యకు ప్రత్యేక స్థానముందని పేర్కొన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో కె.సాహితి రత్న, రికర్వ్ రౌండ్‌లో ఎ.జె.లక్ష్మి, కాంపౌండ్ రౌండ్‌లో ఆర్.మోహన్ సాయి పూజిత, ఎ.టి.ప్రశాంత్ రెడ్డి, కె.కృష్ణ, ఎస్.విజయ్‌కుమార్ ప్రతిభ కనబరిచారని, త్వరలో గురు కాశి యూనివర్సిటీలో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల విలువిద్య టోర్నీలో పాల్గొంటారని ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తెలిపారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి

ఏయూ వీసీ జీపీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్, పాల్గొన్న రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా పని చేస్తూ భవిష్యత్తులో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానాన్ని సాధించాలని ఏయూ ఉప కులపతి జీపీ రాజశేఖర్ సూచించారు. విభాగాధి పతులు, ప్రిన్సిపాళ్లు, డీన్లు తో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ విభాగం నుంచి విశ్వవిద్యాలయం వరకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. భవిష్యత్తులో మెరుగైన ర్యాంకును సాధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులకు సూచించారు.ఏయూ అవుట్ రీచ్ డీన్ ప్రొఫెసర్ కె.రమాసుధ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కేటాయించే సమయంలో పరిగణనలోకి తీసుకునే అంశాలను వివరించారు. ఆయా విభాగాల్లో మెరుగుపడాల్సిన అంశాలను తెలిపారు. ఏయూ పట్ల సానుకూల అవగాహనను పెంపొందించడానికి కృషిచేయాలన్నారు. విదేశీ ప్రొఫెసర్లను స్వాగతించడం, పరిశోధనల్లో ప్రగతి, రీసెర్చ్ ప్రాజెక్టులను సాధించడం ప్రధానమన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు పలు సూచనలిచ్చారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల శుభ్రతపై దృష్టిపెట్టాలి



పారిశుధ్య పరిస్థితిని తనిఖీ చేస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

అల్లిపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎవరూ చెత్త వేయకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. శుక్రవారం 32వ వార్డులోని తెలుగుతల్లి ఫ్లైఓవర్, రైల్వేస్టేషన్ రోడ్, గోకుల్ థియేటర్ ప్రాంతాల్లో పారిశుధ్య తీరును పరిశీలించారు. సకాలంలో క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ జరగాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కీర్తి, అప్పారావు, వార్డు శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వేన్యూకాలనీలో స్వచ్ఛభారత్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 42వ వార్డు బీజేపీ ఇన్‌చార్జ్ గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని రైల్వేన్యూకాలనీలో శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు పరిసర ప్రాంతాల్లోని చెత్తను శుభ్రం చేసి డస్ట్‌బిన్‌లో వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్‌రెడ్డి, ఎస్.రఘునాథ్, గిరిజ పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ జట్టు బౌలింగ్ కోచ్‌గా పీటర్ డోంకర్స్

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా న్యూజిలాండ్‌కు చెందిన బ్రాండన్ పీటర్ డోంకర్స్‌ను నియమించామని ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీష్‌బాబులు తెలిపారు. ఆంధ్ర క్రికెట్‌ను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఇప్పటికే న్యూజిలాండ్‌కు చెందిన గ్యారీ స్టీడ్‌ను హెడ్ కోచ్‌గా నియమించగా బౌలింగ్, ఫీల్డింగ్‌ను పటిష్ఠం చేయాలనే ఉద్దేశంతో బ్రాండన్ పీటర్ డోంకర్స్‌ను కూడా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పెంచుకోవాలి



గుడ్డ సంచులు చూపిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పెంచుకోవాలని ఐఐఎం ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి సూచించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీటీజీ వనమాలి గార్డినర్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ గార్డినర్ లీలావాసు తన ఇంటి ఆవరణలో ఒక సామాజిక వనాన్ని సృష్టించి అడిగిన వారికి మొక్కలు అందిస్తుండడాన్ని అభినందించారు. సొసైటీ అక్కయ్యపాలెం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి వద్ద మిద్దె తోట పెంచుకోవాలని, ఔత్సాహికులకు తమ గార్డినర్స్ సొసైటీ ఉచితంగా శిక్షణ, మొక్కలు, సీడ్ బ్యాంక్ ద్వారా విత్తనాలు పంపిణీ చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీటీజీ వనమాలి అడ్మిన్ సరిత, కర్రి జగన్నాథరావు, కొంతల జోగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

23న మలయాళ చలనచిత్రం ఉచిత ప్రదర్శన

డాబాగార్డెన్స్ సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను 'యూ' ఆకారంలో కూర్చోబెట్టాలి అనే అంశంతో తెరకెక్కిన మలయాళ చిత్రం 'స్థనార్థ శ్రీకుట్టం' చిత్రాన్ని విశాఖ పౌరగ్రంథాలయంలో ఈ నెల 23న సాయంత్రం ఆరు గంటలకు ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దర్శకుడు వినేష్ విశ్వనాథ్ రూపొందించిన ఈ చిత్రానికి అనేక అవార్డులు లభించాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీఈపీడీసీఎల్ ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్‌నగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, శాంతిపురం, బీఎస్ లేఅవుట్, నరసింహనగర్, రైతుబజారు ఏరియా, నాగేశ్వరరావు గ్యాస్ గొడౌన్ ఏరియా, రెడ్డి తాటిచెట్లపాలెం, శివాలయం వీధులు, సంతోషిమాత ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

టీఎస్ఆర్ కాంప్లెక్స్ పరిధిలో..

సీతమ్మధార: టీఎస్ఆర్ కాంప్లెక్సు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ద్వారకానగర్, భీమ్‌నగర్, మధురానగర్, దొండపర్తి తదితర విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఉదయం 6.30 నుంచి 10.30 వరకు ద్వారకానగర్, సంగం శరత్ థియేటర్ వెనుక ప్రాంతం, డైమండ్ పార్కు, ఆర్‌టీసీ కాంప్లెక్సు, మధురానగర్, లలితానగర్, రామకృష్ణనగర్, మండవారిపేట, నెహ్రూ బజార్, వాటర్ వర్క్సు ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సృజనాత్మకత వైపు అడుగులు వేస్తేనే మంచి భవిష్యత్తు

- విద్యార్థులకు ఎంపీ శ్రీభరత్ సూచన



ఎంపీ శ్రీభరత్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ప్రముఖులు

మహారాణిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలబడాలంటే కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్-ఏఐ) ఆధారిత ఆధునిక విద్య తప్పని సరి అని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఏఐ ప్రభావంతో మానవతను నిలబెట్టే విద్యా విలువలను ప్రోత్సహించేందుకు కేథలిక్ ఎడ్యుకేషన్ సమ్మిట్-2025ను విశాఖ ఆర్చ్‌డయాసిస్ జగదాంబ జంక్షన్ వద్ద ఒక హోటల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. విశాఖ అగ్రపీఠాధిపతి బిషప్ ఉడుముల బాల ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాటాడుతూ విద్యావిధానాన్ని సాంకేతికతతో అనుసంధానించి బోధన పద్ధతులు మార్చితేనే కొత్తతరం ప్రపంచ స్థాయిలో ప్రతిభ చాటగలరని అన్నారు. ఏఐ ఆధారిత ప్రాజెక్టులు సృజనాత్మక ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు సైతం ఈ నైపుణ్యాలపైనే ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారుతున్నా, గ్లోబల్ సాంకేతికతను అర్థం చేసుకో వటమే కాకుండా మన ప్రాంతీయ వనరులు, సంస్కృతి, వ్యాపారాలను కాపాడుకోవటం మన సమాజ అభి వృద్ధికి కీలకమన్నారు. ఈ సందర్భం గా భవిష్యత్ విద్యా విధానాలపై నిపుణులు చర్చించారు. ఈ సమావే శంలో విద్యారంగ నిపుణులు కేవీ ప్రవీణరాజ్, నిశాంత్ రెడ్డి, ఫాదర్ భరత్, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రీన్ ఏపీ నినాదంతో మొక్కలు నాటాలి



స్వచ్ఛతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఏపీ నినాదంతో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. సెప్టెంబరు మూడో శనివారం స్వర్ణాంధ్ర జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూల్‌పై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ కార్యాలయంలో క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టాలని, అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యాలయాల పరిధిలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని, పచ్చదనం పెంపునకు అటవీ శాఖ అధికారులు మొక్కలు అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ నెల 22 వరకు స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్‌వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైద్య సేవలపై అధికారి ఆరా



బాపూజీనగర్ ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతమ్మధార, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన మహిళ..శక్తివంతమైన కుటుంబం (స్వస్థ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్)లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం బాపూజీ నగర్, స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అభ ఐడి రిజిస్ట్రేషన్ పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు గర్భిణులకు సేవలు, ల్యాబ్ టెస్టు, క్యాన్సర్, ఎన్‌సిడి 4.0 స్క్రీనింగ్ సికిల్ సెల్ అనీమియా, పోషణ తదితర విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అక్టోబరు 2 వరకు ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా మాతా శిశువులు, గర్భిణులకు సేవలు సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ శిబిరాలలో అభ ఐడి గుర్తించాలని, ఈహెచ్‌ఆర్ కూడా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. స్వర్ణ భారతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు అందించవలసిన సేవలు, పెండింగ్‌లో ఉన్న నివేదికలపై ప్రశ్నించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీల భర్తీకి డిమాండ్



డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో పాల్గొన్న శ్రామిక కాంగ్రెస్ డివిజనల్ కో-ఆర్డినేటర్ రామ్మోహన్, ఇతర నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేరు డివిజన్ శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు డీఆర్ఎం కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో తూ.కో రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహన్ మాట్లాడుతూ రోజురోజుకూ కార్మికులపై పనిభారం, ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ విధానాలు ఎత్తివేయాలని, రన్నింగ్ స్టాఫ్‌కు కనీస గ్యారంటీగా కిలో మీటరేజ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు కీలకంగా నిలిచే ఇంజనీరింగ్ ట్రాక్‌మెన్‌ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లోవర్ డివిజన్ క్లర్క్స్, జనరల్ డిపార్టుమెంటల్ కాంపిటేటివ్ ద్వారా సకాలంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అందులో ఇంజనీరింగ్ కార్మికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎస్.రావు, ఇతర కేంద్ర నాయకులు, బ్రాంచి కార్యదర్శులతో డీఆర్ఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి



సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఓజోన్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ కళాశాలలో బయోలజీ అసోసియేషన్, జువాలజీ విభాగం సంయుక్తంగా ఎకాలజీ కమిషన్‌తో కలిపి శుక్రవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగాధిపతి డా.పి.రూపవాణి ఓజోన్ పొరను భూమికి రక్షణ కవచంగా భావించి, దానిని కాపాడాల్సిన ఆవశ్యకతను విద్యార్థినులకు వివరించారు. హానికరమైన అల్ట్రావయలెట్ కిరణాల నుంచి రక్షణ కోసం గొడుగును ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జెనిత్ ఇంపాక్ట్ వర్క్సు ప్రతినిధి ఎస్.రవికాంత్, డా.మాణిక్యకుమారి, డా.ఈ.హరిణి ఓజోన్ ప్రాముఖ్యతను, దుష్ప్రభావాలను వివరించారు. డా.రోసినా జార్జ్. డా.మేరీ అనుపమ, బోటనీ, జువాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర స్థాయి టెన్నిస్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, బీచ్ వాలీబాల్, టేబుల్ టెన్నిస్ టోర్నీలలో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వి.ఎ.పుష్పలత తెలిపారు. బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో స్విమ్మింగ్, గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్సు హాల్లో టేబుల్ టెన్నిస్, బుల్లయ్య కళాశాల ఇండోర్ స్పోర్ట్సు హాల్లో వెయిట్ లిఫ్టింగ్, ఏయూ టెన్నిస్ కాంప్లెక్సులో టెన్నిస్, ఆర్కే బీచ్‌లో బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలలో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

సర్దుకుంటున్న ఆక్రమణదారులు

మురళీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రహదారులను ఆక్రమించినవారిపై కఠిన చర్యలకు జీవీఎంసీ కమిషనరు ఆదేశించడంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆక్రమణదారులకు వణుకు పుట్టింది. ప్రధాన రోడ్లను ఆక్రమించిన దుకాణదారులు తమ సామగ్రిని సర్దేసుకుంటున్నారు. స్థానిక సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తు సమాచారంగా పరిస్థితిని వర్తకులకు వివరించడం, ఇప్పటికే అనేక ప్రాంతాల్లో తొలగింపులు ఊపందుకోవడంతో ఆక్రమణదారులు స్వచ్ఛందంగానే షెడ్లు, కర్రలు పాతి అల్లిన టెంట్లు తీసుకుంటున్నారు. ఆక్రమణలపై జెడ్సీ బి.రాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో 51వ వార్డు కళింగనగర్ ప్రాంతం, మురళీనగర్ మసీదు జంక్షన్, మాధవధార బిర్లా జంక్షన్ ప్రాంతాల్లో బడ్డీలు స్వచ్ఛందంగానే తొలగిస్తున్నారు.

ఈ రెండు చోట్ల ఆక్రమణలకు చెక్ పెట్టేదెప్పుడు?

- కంచరపాలెం, డాబాగార్డెన్స్‌లో హెచ్చరికలు బేఖాతరు
- యథేచ్ఛగా ఆక్రమణలు
- జీవీఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రెచ్చిపోతున్న వ్యాపారులు
- రోడ్డు మీదే వ్యాపారాలు
- ఫిర్యాదు చేసినా స్పందన లేదు



కంచరపాలెంలో ట్రాఫిక్‌తో నిండిపోయిన రైతు బజార్ రోడ్డు



నడిరోడ్డును ఆక్రమించి నిలిపేసిన వాహనాలు



శారదాస్ట్రీట్‌లో రోడ్డుపైన బడ్డీ

కంచరపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం రైతుబజారు వద్ద చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల వ్యాపారులు జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.! రోడ్డు మీదే వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనదారులకు, ప్రజలకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఉదయం, సాయంకాలం సమయాల్లో బజారుకు అధిక సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. దీంతో బజారు ముందు ట్రాఫిక్ నిలిచిపోయి ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం ఈ మార్గంలో రైతు బజారు వద్ద ఇదే దుస్థితి ఏర్పడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వరకు గల ఈ సర్వీస్ రోడ్డులో సగం వరకు తోపుడు బండ్లు, చిరువ్యాపారాలతో నిండిపోతుంది. గతంలో పలుమార్లు ఈ సమస్యపై కథనాలు ప్రచురించినప్పటికీ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుని వదిలేయడంతో వర్తకులదే ఇష్టారాజ్యంగా ఉంటోందని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు తమకు ఆదాయం వచ్చే అక్రమ నిర్మాణాలు తప్ప ఇటువంటి ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలపై, రోడ్డుకు సగానికి పైగా ఆక్రమణలు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులో ఇష్టానుసారంగా బడ్డీలు పుట్టుకొస్తున్నాయి. డాబాగార్డెన్స్‌లోని కృష్ణాగార్డెన్స్ ప్రేమ సమాజం, పెన్ స్కూల్, శారదాస్ట్రీట్ ప్రాంతాల్లో కాలువలను, రోడ్డుసగానికి వచ్చేసి బడ్డీలను ఏర్పాటు చేస్తూ రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. పదుల సంఖ్యలో రోడ్డుపైనే మినీ లోడింగ్ ఆటోలు, ఇతరత్రా భారీ వాహనాలకు అడ్డాగా ఆయా ప్రాంతాలు నిలుస్తున్నాయి. కొందరు కాలువలపై సిమెంట్ బేస్‌మెంట్‌తో బడ్డీలను ఏరాటు చేస్తున్నా సంబంధిత అధికారులకు కానరావడం లేదు. సాయంత్రం వేళ ట్రాఫిక్ జామ్ నెలకొనడంతో పాటు భారీ వాహనాలు వస్తే చాలా సేపు వేచిఉండాల్సిన దుస్థితి నెలకొంటోంది. అసలు ఎవరి అనుమతితో వీటిని ఇష్టానుసారంగా ఆయా కాలువలపై ఏర్పాటు చేశారో సంబంధిత అధికారులకే తెలియాలి. రానున్న వర్షకాలంలో కాలువల్లోని ప్రవహించే మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తే సమస్య మరింత జటిలంగా తయారయ్యే అవకాశం ఉంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సింహవల్లీ తాయార్, సుమర్ల అమ్మవార్ల తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బంగారు తొళక్కియాన్‌లో ఉంచారు. ఆలయ ఆస్థాన విద్వాంసుల సునాద నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ బేడామండపంలో తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రంపాలెం పాఠశాలపై లోకేశ్ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

మైదానం ఎత్తు పెంచాలని చెబుతున్నారు. మరింత మట్టి తోలి రోలింగ్ చేయాల్సి ఉంటుందని ఇంజనీర్ ఒకరు పేర్కొన్నారు. ఈ విషయం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా మంత్రి లోకేశ్ ఆదేశాలతో చంద్రంపాలెం పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తాత్కాలికంగా ఏపీ మౌలిక వసతుల కల్పన సంస్థ కొంత వరకు మట్టివేసి చదునుచేస్తోందన్నారు. భవిష్యతులో మైదానం పక్కాగా ఉండాలంటే మరిన్ని నిధులు అవసరమన్నారు. ఇంజనీరింగ్ నిపుణులతో ప్రతిపాదన తయారుచేయించి కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

ఆర్టీసీ దసరా స్పెషల్స్ 300

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. దసరా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్టీసీ రీజనల్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, ట్రాఫిక్ మేనేజర్లు, కంట్రోలర్లు అప్రమత్తంగా ఉండాలని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి సమయాల్లో కూడా ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ప్రస్తావించారు. గురువారం నాటి ఘటన విమానాశ్రయ పరిసరాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని విమాన ప్రయాణికులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టులోనే విమానం

పక్షి ఢీకొన్న ఘటనలో మరమ్మతులకు గురైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రస్తుతం విశాఖ విమానాశ్రయంలోనే ఉన్నట్టు సమాచారం. దానికి సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిసింది.

ఉద్యోగుల చేతుల్లోనే స్టీల్‌ప్లాంటు భవిష్యత్తు

... 5వ పేజీ తరువాయి

ప్రధానంగా ముడి సరకులు కొరత ఉందని, ఇంకా మూడున్నర దశాబ్దాల కిందట కర్మాగారం కావడంతో నిర్వహణపరమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాటి పరిష్కారంలో సిబ్బంది సహకారం చాలా అవసరమన్నారు. కొందరు స్టీల్‌ప్లాంటు ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, దయచేసి అలాంటి పనులకు పాల్పడవద్దన్నారు. సీఎండీ సహా ఉన్నతాధికారులంతా కొద్దిరోజులు మాత్రమే ఇక్కడ ఉంటారని, ఆ తరువాత వెళ్లిపోతారని, శాశ్వతంగా ఉండేది ఉద్యోగులు మాత్రమేనన్నారు. కాబట్టి వారే ప్లాంటు పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మూడు ఫర్నేస్‌లను వంద శాతం సామర్థ్యంతో నడపాలన్నారు. టీమ్ వర్క్, ఎవరు ఎక్కడైనా పనిచేసేలా అన్నింటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంటు భూముల అమ్మకంపై అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఉద్యోగులకు అక్టోబరు నుంచి వంద శాతం జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అన్నీ కుదుటపడి ప్లాంటు పూర్వస్థితికి వస్తే మళ్లీ ప్రమోషన్‌లు ఇస్తామని భరోసా ఇచ్చారు.

ఉలిక్కిపడిన పారిశ్రామిక ప్రాంతం

... 5వ పేజీ తరువాయి

మండల తహశీల్దార్ రమేష్‌నాయుడు, ఆర్‌ఐ దివ్య సంద ర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్రెసర్ స్టార్ట్ చేసినప్పుడు అక్కడ కేవలం నలుగురు కార్మికులు మాత్రమే ఉన్నారని, వారు కూడా ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారని తెలిపారు.

భద్రత లేదు: సీఐటీయూ

నూతనంగా నిర్మిస్తున్న యూనిట్‌లో కార్మికులకు భద్రత లేదని సీఐటీయూ నాయకుడు లక్ష్మణమూర్తి ఆరోపించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న యూనిట్‌లో ఇంకా పనులు కొనసాగుతుండగానే చమురు శుద్ధి పనులు మొదలుపెట్టేశారని ఆరోపించారు. అంత భారీపేలుడు సంభవించినప్పటికీ అధికారులు సైరన్ మోగించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యం కార్మికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కల్తీ నెయ్యి ముఠా గుట్టు రట్టు

... 5వ పేజీ తరువాయి

గమనించారు. వివిధ కంపెనీలకు చెందిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో బళ్లారి నుంచి తెచ్చిన క్రీమ్స్‌ను కలిపి నెయ్యి మాదిరి తయారు చేస్తున్నట్టు, వాసన రావడానికి కొన్నిరకాల రసాయనాలను వినియోగిస్తున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు గుర్తించారు. కల్తీ నెయ్యిని కిలో రూ.350 చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో ఫంక్షన్లకు కేటరింగ్ చేసే సంస్థలకు విక్రయిస్తున్నట్టు తేల్చారు. కల్తీ నెయ్యి తయారుచేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న బళ్లారికి చెందిన లక్ష్మీపతి, శ్రీధర్, రాజశేఖర్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తయారుచేసిన 120 కిలోల కల్తీ నెయ్యిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించనున్నట్టు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్.ఐ. భరత్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తం

... 5వ పేజీ తరువాయి

ఆపివేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ దల్లిగోవిందరాజుతోపాటు దక్షిణ నియోజకవర్గానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని డీసీపీ హరిదాసుతో చర్చించారు. శుక్రవారం రాత్రి మరోసారి దుకాణాలు తొలగింపునకు అధికారులు సమాయత్తమవ్వడంతో కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించడం ప్రారంభించారు.

ఫుడ్‌కోర్టు తొలగింపు హేయమైన చర్య

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన నైట్ ఫుడ్‌కోర్టు తొలగింపు హేయమైన చర్య అని ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యేనైన తనకు కనీసం సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌కు లేదా? అని ప్రశ్నించారు. ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని వారిద్దరే నిర్ణయించుకుని వ్యాపారులకు కూడా నోటీసు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఫుడ్ కోర్టు అంశాన్ని మరోసారి కౌన్సిల్‌లో చర్చకు పెడితే మెజారిటీ చూపించుకోవచ్చునన్నారు. అధికారులు చేసిన పని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఊరుకునేది లేదన్నారు. ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఒక్కసారి రోడ్డునపడేయడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానన్నారు. వ్యాపారులకు కార్డులు జారీ చేసి అద్దె నిర్ణయిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు.

కౌన్సిల్ తీర్మానం ప్రకారమే తొలగింపు

నైట్ ఫుడ్‌కోర్టును తొలగించాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో చేసిన తీర్మానానికి అనుగుణంగానే తాము చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న ఫుడ్‌కోర్టు వల్ల జీవీఎంసీకి కనీసం ఆదాయం రాకపోగా, ట్రాఫిక్‌కు, పరిశుభ్రతకు ఇబ్బందికరంగా ఉంటోందన్న ఫిర్యాదులు ఎక్కువగా అందుతున్నాయన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఫుడ్‌కోర్టు ఒక్కటే కాకుండా నగరంలో అన్నిచోట్ల ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. టౌన్ వెండింగ్ కమిటీ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిని గుర్తించి వారికి దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తామన్నారు.

భలేభలే అందాలు..

రైతు బజార్‌లో చెట్లపై చిత్రాలు

» ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల సృజనాత్మకత

» ఆకర్షణీయంగా బజార్ ప్రాంగణం


రంగులతో ముచ్చట గొల్పుతున్న చెట్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజారు కొత్త హంగులతో స్వాగతం పలుకుతోంది. స్వచ్ఛసంరక్షణ్‌లో భాగంగా రైతు బజార్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులతో వృక్షాలను అందంగా తీర్చిదిద్దారు. వాటికి ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. బజార్ మధ్యలో ఉన్న మర్రి చెట్టును ఏకంగా భూతంగా మార్చేశారు. అది చూసి కొందరు జడుసుకుంటుంటే, మరికొందరు చిత్రలేఖనానికి ముచ్చటపడుతున్నారు. బజార్‌లోని చెట్లకు వర్ణాలద్ది, విద్యార్థులు శెభాష్ అనిపించుకున్నారు.

ఓ కొబ్బరి చెట్టుకు ఏడు రంగులు, ఇతర చెట్లకు పలు రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ సూచనల మేరకు ఈ చిత్రాలను వేయించినట్టు బజార్ ఎస్టేటు అధికారి వరహాలు తెలిపారు.

మొత్తం మీద చెట్లను ఆకర్షణీయంగా తయారు చేయించి, వినియోగదారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నారు.




బజార్ ఆవరణలో రంగురంగుల చిత్రాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వృక్షాలు


మర్రిమానుపై బేతాళుడు

భీమిలిలో మహిళా ప్రత్యేక సెజ్

» అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన భీమిలి ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా భీమిలి నియోజకవర్గంలో మహిళా స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్) ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభుత్వాన్నికోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ 2014-19లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆనందపురం మండలం గిడిజాల గ్రామంలో ప్రత్యేక మహిళా సెజ్ కోసం 50 ఎకరాలను ప్రభుత్వం గుర్తించడం జరిగిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సంబంధిత భూమిలో జగనన్న కాలనీ నిర్మించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ (ఏఎల్ఈఏపీ) తెలంగాణలోని గాజులరామారం, విజయవాడ సమీపంలో సూరంపల్లి ప్రాంతాలలో ఇప్పటికే ఆ అసోసియేషన్ ప్రత్యేక మహిళా పారిశ్రామికవాడలను నిర్వహిస్తోందన్నారు. భీమిలి నియోజకవర్గ గ్రామీణ మహిళలు ఉదయం 6 గంటల నుంచి కనీస వేతనాల కన్నా తక్కువ వేతనానికి (రు.పదివేలు నుంచి రు. 12వేలు) సుదూర ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. విశాఖ నుంచి అత్యధికముగా మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, మహిళా భద్రతలో దేశంలోనే విశాఖ ప్రథమ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే ప్రశంసించారన్నారు. టెక్స్‌టైల్స్, ఫ్యాషన్, జ్యువెలరీ, ఆరోగ్య రంగాల్లో మహిళలు విశేష ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. శరవేగంగా అభివృద్ధిచెందుతున్న విశాఖలో టూరిజం, ఐటీ రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రత్యేక మహిళా సెజ్‌ను మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం సెజ్‌లు మంజూరు చేయడం లేదని మంత్రి సమాధానం చెప్పారని, అయితే, సెజ్ పేరుతో కాకుండా మహిళా పారిశ్రామికవాడ గానో, వేరే పేరుతోనైనా ప్రాజెక్టు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గంటా కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయ 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వాహణ, చెట్ల నరికివేత లైన్ల మరమ్మతు పనులు చేపడుతుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వెల్లడించారు. ఇందిరానగర్, ఆదర్శనగర్, సుందర్ నగర్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీధి దీపాలకు మరమ్మతులు


మరమ్మతు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో వీధి దీపాలను విద్యుత్ శాఖ వారు శుక్రవారం బాగుచేశారు. కొన్ని చోట్ల కొత్త దీపాలను అమర్చారు.

అన్న క్యాంటీన్ ఏడాది పండుగ


కేకు కట్ చేసి ఆనందం పంచుకుంటున్న ధర్మారావు, పాల్గొన్న టీడీపీ నేతలు

ఆరిలోవ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల కనక మహాలక్ష్మి నగర్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ నేతలు కేకును కట్ చేసి ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు, 13వ వార్డు తెలుగు మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి, క్లస్టర్ ఇన్‌చార్జి తురకపూడి బాలస్వామి, ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. భోజనాలకు వచ్చిన వారికి కేకును పంచి పెట్టారు.

చోడే పట్టాభికి టీడీపీ నేతల అభినందనలు


పట్టాభిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు రమేష్‌రెడ్డి, గుడ్ల గోవింద్‌రెడ్డి తదితరులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడుగా నియమితులైన చోడే వెంకటపట్టాభిని శుక్రవారం టీడీపీ 23వ వార్డు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభిని టీడీపీ సీనియర్ నాయకులు అచ్చి రమేష్‌రెడ్డి తదితరులు సన్మానించారు. ఆయనతో పాటు టీడీపీ కార్యదర్శి గుడ్ల గోవింద్‌రెడ్డి పట్టాభికి అభినందనలు తెలిపారు.

మత్స్యకారులు తప్పనిసరిగా టెడ్ వినియోగించాలి

» మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు


మత్స్యకారులకు టెడ్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి. లక్ష్మణరావు

బీచ్ రోడ్డు, సెప్టెంబర్ 19, (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు తప్పనిసరిగా టెడ్ వాడాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం నెట్‌ఫిష్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ వద్ద డాల్ఫిన్ బోట్ ఆపరేటర్స్ సంఘం ఆధ్వర్యంలో తాబేళ్ల తప్పించే పరికరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెడ్ పరికరం ట్రాల్ వలలో అనుకోకుండా తాబేళ్లు చిక్కుకున్నప్పుడు తప్పించుకోవడానికి వీలు కల్పిస్తుందని, తాబేళ్ల పరిరక్షణ దృష్ట్యా బోటు యజమానులు చేపల వేట చేసే ట్రాల్ వలలో విధిగా ఈ పరికరాన్ని వాడాలని చెప్పారు. ఈ టెడ్ పరికరం ఒక్కొక్కటి సుమారు రూ.20 వేలు విలువ ఉంటుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకిం కింద 100 శాతం రాయితీపై అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే వంద శాతం రాయితీపై బోట్లకు సరఫరా చేసిన ట్రాన్స్‌పాండర్స్‌ను తప్పక వినియోగించాలని చెప్పారు.

నెట్‌ఫిష్ కో-ఆర్డినేటర్ హనుమంతురావు మాట్లాడుతూ సముద్ర రొయ్యల దిగుమతి కోసం అమెరికా దేశం ఈ టెడ్ వినియోగాన్ని తప్పనిసరి చేసిందని తెలిపారు. రొయ్యలు ఎగుమతి చేయడానికి టెడ్ వినియోగం తప్పక వాడాలని వెల్లడించారు. టెడ్ వినియోగం వల్ల చేపలు, రొయ్యలు తప్పించుకొనే అవకాశం ఉందని తెలిపారు. టెడ్ వినియోగం వల్ల ఇంధనం ఆదా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీ మహంతి, డాల్ఫిన్ బోట్‌యాజమానుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వీర్రాజు, నరసమ్మ, బోటు యజమానులు పాల్గొన్నారు.

అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు ఈసీ రీసెర్చి సెంటర్

తగరపువలస, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగానికి రీసెర్చ్ సెంటర్‌కు జేఎన్టీయూ, జీవి ఆమోదం తెలిపింది. విజయనగరం జేఎన్టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ, డైరెక్టర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు సంబంధిత అనుమతి పత్రాలను అవంతి కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ విభాగాధిపతి జి.అనంత్‌రావు, కో-ఆర్డినేటర్ శంకరరావులకు అందజేశారు. దీనిపై అవంతి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

కాలువలు శుభ్రపరిచిన పారిశుధ్య సిబ్బంది



కాలువను సరిచేయిస్తున్న ఏఎంవోహెచ్ దుర్గాప్రసాద్, శానిటరీ సిబ్బంది

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు చివర ఉమానగర్ ప్రాంతంలో కాలువ మూసుకుపోవడంతో మురుగునీరంతా రోడ్డుపైకి వస్తుందంటూ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జోన్-3 ఏఎంవోహెచ్ దుర్గాప్రసాద్, శానిటరీ సిబ్బంది శుక్రవారం ఉదయం పరిశీలించి, వీధి కాలువ చివర పేరుకుపోయిన మట్టిని తొలగించడంతో పాటు కల్వర్టు కింద ఉన్న కాలువను కూడా శుభ్రం చేయడంతో మురుగునీరు సజావుగా ముందుకు సాగుతోంది. గత కొద్ది కాలంగా ఉన్న సమస్యను పరిష్కరించనందుకు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, జీవీఎంసీ అధికారులు, శానిటరీ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

చేయి కోసుకున్న అర్బన్ పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్

» కార్పొరేటర్ మూర్తి యాదవ్ వేధింపులే కారణమని ఆరోపణ


స్టాఫ్‌నర్స్ పూజిత

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ (యూపీహెచ్‌సీ)లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న పూజిత చేయి కోసుకోవడం ఆందోళన కలిగించింది. దీనికి కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ వేధింపులే కారణమని ఆరోపించడం సంచలనం సృష్టించింది. పీతలవానిపాలెం యూపీహెచ్‌సీలోఏడుగురు సిబ్బంది పనిచేస్తున్నారు. రామ్‌నగర్ వైద్యురాలిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. అయితే సిబ్బంది ప్రతిరోజూ సక్రమంగా విధులకు హాజరుకావడం లేదు. దీంతో కార్పొరేటర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం యూపీహెచ్‌సీని కార్పొరేటర్ సందర్శించేసరికి సిబ్బంది ఎవరూ లేరు. రేసపువానిపాలెంలో వైద్య శిబిరానికి హాజరయ్యారని చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో నోడల్ అధికారి వచ్చి పరిశీలించి, సిబ్బంది విధులకు గైర్హాజరు అయినట్టు రికార్డు చేశారు. అయితే తాను విధుల్లోనే ఉన్నప్పటికీ తనకు గైర్హాజరు వేయడాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురైన స్టాఫ్‌నర్స్ పూజిత చేయి కోసుకుంది. అనంతరం సిబ్బందితో కలిసి డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసింది. ఇది తెలిసిన కార్పొరేటర్ అక్కడికి వెళ్లారు. అయితే విషయం పెద్దది కాకుండా రాజీ పడాలని ఇరువర్గాలకు అధికారులు సూచించినట్టు సమాచారం.

త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ డీఎస్పీలు


మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ డీఎస్పీలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : మూడోపట్టణ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ట్రైనీ డీఎస్పీల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ట్రాఫిక్, శాంతిభద్రతలు, క్రైం ఫిర్యాదులపై కేసులు ఏ విధంగా నమోదు చేస్తారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానాలు, రోడ్డు ప్రమాదాలపై కేసుల నమోదు అంశాలను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ సతీష్ వివరించారు. శాంతిభద్రతలపై ఏఎస్ఐ గోవింద్ వివరించారు. ఏఎస్ఐ సతీష్ వివరించిన తీరుకు ముగ్దులైన డీఎస్పీలు ఆయనకు బహుమతి అందజేశారు.

తెలుగు భాషకు పెద్దపీట వేసేవరకు ఉద్యమం

» తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో నిరసన


తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తెలుగుదండు నాయకులు, ఏయూ తెలుగు విభాగం విద్యార్థులు, పలువురు సాహిత్రీపియులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తెలుగుభాషకు పెద్దపీట వేసే వరకు ప్రజా ఉద్యమం చేపడతామని తెలుగుదండు వ్యవస్థాపకుడు సూరి తెలిపారు. తెలుగుదండు ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కూడలిలో ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి నివాళులు అర్పించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ తెలుగు భాష రక్షణకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అందుకే అమరావతిలోని అసెంబ్లీ ముందే ప్రజా ఉద్యయం నిర్వహించడానికి వెళ్తున్నామన్నారు. గాంధేయ మార్గంలో ఈ ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. తెలుగు భాషను ఇలాగే విస్మరిస్తే భవిష్యత్‌లో తెలుగు ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలుగు భాషాభిమానులు ఉద్యమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. తెలుగులోనే ప్రాథమిక విద్యాబోధన, పదవ తరగతి వరకు ప్రథమ బాషగా తెలుగు ఉండాలని, పాలన వ్యవహారాలు తెలుగులోనే సాగాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఏయూ తెలుగు విభాగం విద్యార్థులు, సాహితీవేత్తలు సూర్యనారాయణ, మోహన్, సూరప్పడు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 3,4 జోన్ల పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ దొండపర్తి 33/11 కేవీ, టీఎస్సార్ సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, జోన్-3,4 పరిధిలో పలు ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం ఏర్పడుతుదని జీవీఎంసీ మంచినీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-3 పరిధిలో గల వార్డు 19లోని లాసన్స్‌బే కాలనీ, పెద్ద జాలరిపేట, 21వ వార్డులో చినవాల్తేరు, పెద్దవాల్తేరు, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం, 23వ వార్డులో కేఆర్ఎం కాలనీ, మద్దిలపాలెం, చైతన్య నగర్, కృష్ణా కళాశాల రోడ్డు, సీతమ్మపేట ప్రాంతంలోని, 27వ వార్డులోని శ్రీనగర్, ద్వారకానగర్, రామాటాకీస్ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

ఏయూలో కబడ్డీ పోటీలు ప్రారంభం



ఏయూ వీసీ రాజశేఖర్, అధికారులతో క్రీడాకారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర యూనివర్శిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ, ఖో-ఖో పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఈ పోటీలను ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ కాలేజీలకు చెందిన కబడ్డీ క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. శతాబ్ది ఉత్సవాల క్రీడల్లో ఏయూ అనుబంధ కాలేజీలు విద్యార్థులు విరివిగా పాల్గొనాలన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్. విజయ్‌మోహన్ మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన అనుబంధ కాలేజీలు నుంచి ఐదు వందల మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. 35 క్రీడా జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏయూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ప్రొఫెసర్ ఎ.పల్లవి, ఐఐపీఈ స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, గొన్నా కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పీడీ కరుణాకర్, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్‌చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె) 8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 36, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 44, దేముడుచిక్కుడు 68, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామ కాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

ద్విచక్ర వాహనాలలో పెట్రోలు చోరీలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ ఎమ్ఐజి-సి-గృహసముదాయాలలో గురువారం అర్ధరాత్రి పలువురి ద్విచక్రవాహనాల నుంచి పెట్రోలు చోరీ జరిగింది. రాత్రి పూట సాగర్ నగర్ కాలనీలో పోలీసులు గస్తీ లేని సమయాలను చోరులు గమనించి ద్విచక్రవాహనాల నుంచి ఇంధనం చోరీకి పాల్పడుతున్నారు. సాగర్‌నగర్ పరిసర ప్రాంతాలలో క్రైమ్ పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఇంటి గడపల ముందు వదిలిన పాదరక్షలను సైతం వదలడం లేదని గగ్గోలు పెడుతున్నారు. చిల్లర దొంగతనాలపై ఆరిలోవ క్రైమ్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఎస్ఐ ఎ.హరికృష్ణ పరిశీలించి స్థానికులకు తగు జాగ్రత్తలు చెప్పారు. రాత్రివేళ గస్తీని కట్టుదిట్టం చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనుమానితుల సమాచారం అందించాలని కోరారు. దసరా సెలవులకు ఇళ్లకు తాళాలు వేసి సొంతూళ్లకు వెళ్లేవారు తమకు ముందుగా సమాచారం ఇస్తే ప్రత్యేక రక్షణ కల్పిస్తామన్నారు.

అంతర్ కళాశాలల విలువిద్య పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్సు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల విలువిద్య (ఆర్చరీ) పోటీలు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో జరిగాయి. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఒలింపిక్స్ గుర్తింపు ఉన్న ప్రధాన క్రీడలలో విలువిద్యకు ప్రత్యేక స్థానముందని పేర్కొన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో కె.సాహితి రత్న, రికర్వ్ రౌండ్‌లో ఎ.జె.లక్ష్మి, కాంపౌండ్ రౌండ్‌లో ఆర్.మోహన్ సాయి పూజిత, ఎ.టి.ప్రశాంత్ రెడ్డి, కె.కృష్ణ, ఎస్.విజయ్‌కుమార్ ప్రతిభ కనబరిచారని, త్వరలో గురు కాశి యూనివర్సిటీలో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల విలువిద్య టోర్నీలో పాల్గొంటారని ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తెలిపారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి

ఏయూ వీసీ జీపీ రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్, పాల్గొన్న రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా పని చేస్తూ భవిష్యత్తులో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానాన్ని సాధించాలని ఏయూ ఉప కుల పతి జీపీ రాజశేఖర్ సూచించారు. విభాగాధి పతులు, ప్రిన్సిపాళ్లు, డీన్లు తో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ విభాగం నుంచి విశ్వవిద్యాలయం వరకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. భవిష్యత్తులో మెరుగైన ర్యాంకును సాధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులకు సూచించారు.ఏయూ అవుట్‌రీచ్ డీన్ ప్రొఫెసర్ కె.రమాసుధ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కేటాయించే సమయంలో పరిగణనలోకి తీసుకునే అంశాలను వివరించారు. ఆయా విభాగాల్లో మెరుగుపడాల్సిన అంశాలను తెలిపారు. ఏయూ పట్ల సానుకూల అవగాహనను పెంపొందించడానికి కృషిచేయాలన్నారు. విదేశీ ప్రొఫెసర్లను స్వాగతించడం, పరిశోధనల్లో ప్రగతి, రీసెర్చ్ ప్రాజెక్టులను సాధించడం ప్రధానమన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు పలు సూచనలిచ్చారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల శుభ్రతపై దృష్టిపెట్టాలి



పారిశుధ్య పరిస్థితిని తనిఖీ చేస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

అల్లిపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎవరూ చెత్త వేయకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించి రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. శుక్రవారం 32వ వార్డులోని తెలుగుతల్లి ఫ్లైఓవర్, రైల్వేస్టేషన్ రోడ్, గోకుల్ థియేటర్ ప్రాంతాల్లో పారిశుధ్య తీరును పరిశీలించారు. సకాలంలో క్లాప్ వాహనాల ద్వారా చెత్త సేకరణ జరగాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కీర్తి, అప్పారావు, వార్డు శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైల్వేన్యూకాలనీలో స్వచ్ఛభారత్



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 42వ వార్డు బీజేపీ ఇన్‌చార్జ్ గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని రైల్వేన్యూకాలనీలో శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు పరిసర ప్రాంతాల్లోని చెత్తను శుభ్రం చేసి డస్ట్‌బిన్‌లో వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్‌రెడ్డి, ఎన్.రఘునాథ్, గిరిజ పాల్గొన్నారు.

ఆంధ్ర క్రికెట్ జట్టు బౌలింగ్ కోచ్‌గా పీటర్ డోంకర్స్

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా న్యూజిలాండ్‌కు చెందిన బ్రాండన్ పీటర్ డోంకర్స్‌ను నియమించామని ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేశినేటి శివనాథ్, సానా సతీష్‌బాబులు తెలిపారు. ఆంధ్ర క్రికెట్‌ను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఇప్పటికే న్యూజిలాండ్‌కు చెందిన గ్యారీ స్టీడ్‌ను హెడ్ కోచ్‌గా నియమించగా బౌలింగ్, ఫీల్డింగ్‌ను పటిష్ఠం చేయాలనే ఉద్దేశంతో బ్రాండన్ పీటర్ డోంకర్స్‌ను కూడా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పెంచుకోవాలి



గుడ్డ సంచులు చూపిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకు కూరలు పెంచుకోవాలని ఐఐఎం ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి సూచించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీటీజీ వనమాలి గార్డినర్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ గార్డినర్ లీలావాసు తన ఇంటి ఆవరణలో ఒక సామాజిక వనాన్ని సృష్టించి అడిగిన వారికి మొక్కలు అందిస్తుండడాన్ని అభినందించారు. సొసైటీ అక్కయ్యపాలెం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి వద్ద మిద్దె తోట పెంచుకోవాలని, ఔత్సాహికులకు తమ గార్డినర్స్ సొసైటీ ఉచితంగా శిక్షణ, మొక్కలు, సీడ్ బ్యాంక్ ద్వారా విత్తనాలు పంపిణీ చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీటీజీ వనమాలి అడ్మిన్ సరిత, కర్రి జగన్నాథరావు, కొంతల జోగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

23న మలయాళ చలనచిత్రం ఉచిత ప్రదర్శన

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను 'యూ' ఆకారంలో కూర్చోబెట్టాలి అనే అంశంతో తెరకెక్కిన మలయాళ చిత్రం 'స్థనార్థ శ్రీకుట్టం' చిత్రాన్ని విశాఖ పౌరగ్రంథాలయంలో ఈ నెల 23న సాయంత్రం ఆరు గంటలకు ఉచితంగా ప్రదర్శిస్తున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దర్శకుడు వినేష్ విశ్వనాథ్ రూపొందించిన ఈ చిత్రానికి అనేక అవార్డులు లభించాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్‌నగర్, ఎన్‌జీజీవోస్ కాలనీ, శాంతిపురం, బీఎస్ లేఅవుట్, నరసింహనగర్, రైతుబజారు ఏరియా, నాగేశ్వరరావు గ్యాస్ గొడౌన్ ఏరియా, రెడ్డి తాటిచెట్లపాలెం, శివాలయం వీధులు, సంతోషిమాత ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

టీఎస్ఆర్ కాంప్లెక్స్ పరిధిలో..

సీతమ్మధార: టీఎస్ఆర్ కాంప్లెక్సు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ద్వారకానగర్, భీమనగర్, మధురానగర్, దొండపర్తి తదితర విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ఉదయం 6.30 నుంచి 10.30 వరకు ద్వారకానగర్, సంగం శరత్ థియేటర్ వెనుక ప్రాంతం, డైమండ్ పార్కు, ఆర్టీసీ కాంప్లెక్సు, మధురానగర్, లలితానగర్, రామకృష్ణనగర్, మండవారిపేట, నెహ్రూ బజార్, వాటర్ వర్క్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సృజనాత్మకత వైపు అడుగులు వేస్తేనే మంచి భవిష్యత్తు

» విద్యార్థులకు ఎంపీ శ్రీభరత్ సూచన



ఎంపీ శ్రీభరత్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న ప్రముఖులు

మహారాణిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ ప్రపంచంలో నిలబడాలంటే కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్-ఏఐ) ఆధారిత ఆధునిక విద్య తప్పని సరి అని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఏఐ ప్రభావంతో మానవతను నిలబెట్టే విద్యా విలువలను ప్రోత్సహించేందుకు కేథలిక్ ఎడ్యుకేషన్ సమ్మిట్-2025ను విశాఖ ఆర్చ్‌డయాసిస్ జగదాంబ జంక్షన్ వద్ద ఒక హోటల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశాఖ అగ్రపీఠాధిపతి బిషప్ ఉడుముల బాల ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాటాడుతూ విద్యావిధానాన్ని సాంకేతికతతో అనుసంధానించి బోధన పద్ధతులు మార్చితేనే కొత్తతరం ప్రపంచ స్థాయిలో ప్రతిభ చాటగలరని అన్నారు. ఏఐ ఆధారిత ప్రాజెక్టులు సృజనాత్మక ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు సైతం ఈ నైపుణ్యాలపైనే ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారుతున్నా, గ్లోబల్ సాంకేతికతను అర్థం చేసుకోవటమే కాకుండా మన ప్రాంతీయ వనరులు, సంస్కృతి, వ్యాపారాలను కాపాడుకోవటం మన సమాజ అభివృద్ధికి కీలకమన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్ విద్యా విధానాలపై నిపుణులు చర్చించారు. ఈ సమావేశంలో విద్యారంగ నిపుణులు కేవీ ప్రవీణరాజ్, నిశాంత్ రెడ్డి, ఫాదర్ భరత్, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రీన్ ఏపీ నినాదంతో మొక్కలు నాటాలి



స్వచ్ఛతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఏపీ నినాదంతో ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. సెప్టెంబరు మూడో శనివారం స్వర్ణాంధ్ర జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాల షెడ్యూల్‌పై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ కార్యాలయంలో క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టాలని, అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యాలయాల పరిధిలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని, పచ్చదనం పెంపునకు అటవీ శాఖ అధికారులు మొక్కలు అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ నెల 22 వరకు స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్వో భవానీ శంకర్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైద్య సేవలపై అధికారి ఆరా



బాపూజీనగర్ ఆరోగ్య కేంద్ర సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతమ్మధార, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన మహిళ..శక్తివంతమైన కుటుంబం (స్వస్థ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్)లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం బాపూజీ నగర్, స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అభ ఐడి రిజిస్ట్రేషన్ పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు గర్భిణులకు సేవలు, ల్యాబ్ టెస్టు, క్యాన్సర్, ఎన్‌సిడి 4.0 స్క్రీనింగ్ సికిల్ సెల్ అనిమియా, పోషణ తదితర విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అక్టోబరు 2 వరకు ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా మాతా శిశువులు, గర్భిణులకు సేవలు సాధ్యమైనంత వరకు అందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ శిబిరాలలో అభ ఐడి గుర్తించాలని, ఈహెచ్ఆర్ కూడా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. స్వర్ణ భారతి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు అందించవలసిన సేవలు, పెండింగ్‌లో ఉన్న నివేదికలపై ప్రశ్నించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీల భర్తీకి డిమాండ్



డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో పాల్గొన్న శ్రామిక కాంగ్రెస్ డివిజనల్ కో-ఆర్డినేటర్ రామ్మోహన్, ఇతర నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ యూనియన్ వాల్తేరు డివిజన్ శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు డీఆర్ఎం కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో తూ.కో రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ పి.రామ్మోహన్ మాట్లాడుతూ రోజురోజుకూ కార్మికులపై పనిభారం, ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ విధానాలు ఎత్తివేయాలని, రన్నింగ్ స్టాఫ్‌కు కనీస గ్యారంటీగా కిలో మీటరేజ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు కీలకంగా నిలిచే ఇంజనీరింగ్ ట్రాక్‌మెన్‌ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లోవర్ డివిజన్ క్లర్క్, జనరల్ డిపార్టుమెంటల్ కాంపిటేటివ్ ద్వారా సకాలంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, అందులో ఇంజనీరింగ్ కార్మికులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ఎస్.రావు, ఇతర కేంద్ర నాయకులు, బ్రాంచి కార్యదర్శులతో డీఆర్ఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర స్థాయి టెన్నిస్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, బీచ్ వాలీబాల్, టేబుల్ టెన్నిస్ టోర్నీలలో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వి.ఎ.పుష్పలత తెలిపారు. బీచ్‌రోడ్డు ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో స్విమ్మింగ్, గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్సు హాల్లో టేబుల్ టెన్నిస్, బుల్లయ్య కళాశాల ఇండోర్ స్పోర్ట్సు హాల్లో వెయిట్ లిఫ్టింగ్, ఏయూ టెన్నిస్ కాంప్లెక్సులో టెన్నిస్, ఆర్కే బీచ్‌లో బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలలో పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకోవాలి



సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఓజోన్ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ కళాశాలలో బయోలజీ అసోసియేషన్, జువాలజీ విభాగం సంయుక్తంగా ఎకాలజీ కమిషన్‌తో కలిపి శుక్రవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగాధిపతి డా.పి.రూపవాణి ఓజోన్ పొరను భూమికి రక్షణ కవచంగా భావించి, దానిని కాపాడాల్సిన ఆవశ్యకతను విద్యార్థినులకు వివరించారు. హానికరమైన అల్ట్రావయలెట్ కిరణాల నుంచి రక్షణ కోసం గొడుగును ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో జెనిత్ ఇంపాక్ట్ వర్క్స్ ప్రతినిధి ఎస్.రవికాంత్, డా.మాణిక్యకుమారి, డా.ఈ.హరిణి ఓజోన్ ప్రాముఖ్యతను, దుష్ప్రభావాలను వివరించారు. డా.రొసినా జార్జ్. డా.మేరీ అనుపమ, బోటనీ, జువాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్దుకుంటున్న ఆక్రమణదారులు

మురళీనగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రహదారులను ఆక్రమించినవారిపై కఠిన చర్యలకు జీవీఎంసీ కమిషనరు ఆదేశించడంతో విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆక్రమణదారులకు వణుకు పుట్టింది. ప్రధాన రోడ్లను ఆక్రమించిన దుకాణదారులు తమ సామగ్రిని సర్దేసుకుంటున్నారు. స్థానిక సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తు సమాచారంగా పరిస్థితిని వర్తకులకు వివరించడం, ఇప్పటికే అనేక ప్రాంతాల్లో తొలగింపులు ఊపందుకోవడంతో ఆక్రమణదారులు స్వచ్ఛందంగానే షెడ్లు, కర్రలు పాతి అల్లిన టెంట్లు తీసుకుంటున్నారు. ఆక్రమణలపై జెడ్సీ బి.రాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో 51వ వార్డు కళింగనగర్ ప్రాంతం, మురళీనగర్ మసీదు జంక్షన్, మాధవధార బిర్లా జంక్షన్ ప్రాంతాల్లో బడ్డీలు స్వచ్ఛందంగానే తొలగిస్తున్నారు.

ఈ రెండు చోట్ల ఆక్రమణలకు చెక్ పెట్టేదెప్పుడు?

» కంచరపాలెం, డాబాగార్డెన్స్‌లో హెచ్చరికలు బేఖాతరు » యథేచ్ఛగా ఆక్రమణలు » జీవీఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రెచ్చిపోతున్న వ్యాపారులు » రోడ్డు మీదే వ్యాపారాలు » ఫిర్యాదు చేసినా స్పందన లేదు



కంచరపాలెంలో ట్రాఫిక్‌తో నిండిపోయిన రైతు బజార్ రోడ్డు



నడిరోడ్డును ఆక్రమించి నిలిపేసిన వాహనాలు



శారదాస్ట్రీట్‌లో రోడ్డుపైన బడ్డీ

కంచరపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం రైతుబజారు వద్ద చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల వ్యాపారులు జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు..! రోడ్డు మీదే వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనదారులకు, ప్రజలకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఉదయం, సాయంకాలం సమయాల్లో బజారుకు అధిక సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. దీంతో బజారు ముందు ట్రాఫిక్ నిలిచిపోయి ఈ మార్గం గుండా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం ఈ మార్గంలో రైతు బజారు వద్ద ఇదే దుస్థితి ఏర్పడుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వరకు గల ఈ సర్వీస్ రోడ్డులో సగం వరకు తోపుడు బండ్లు, చిరువ్యాపారాలతో నిండిపోతుంది. గతంలో పలుమార్లు ఈ సమస్యపై కథనాలు ప్రచురించినప్పటికీ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుని వదిలేయడంతో వర్తకులదే ఇష్టారాజ్యంగా ఉంటోందని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు తమకు ఆదాయం వచ్చే అక్రమ నిర్మాణాలు తప్ప ఇటువంటి ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలపై, రోడ్డుకు సగానికి పైగా ఆక్రమణలు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులో ఇష్టానుసారంగా బడ్డీలు పుట్టుకొస్తున్నాయి. డాబాగార్డెన్స్‌లోని కృష్ణాగార్డెన్స్ ప్రేమ సమాజం, పెన్ స్కూల్, శారదాస్ట్రీట్ ప్రాంతాల్లో కాలువలను, రోడ్డుసగానికి వచ్చేసి బడ్డీలను ఏర్పాటు చేస్తూ రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. పదుల సంఖ్యలో రోడ్డుపైనే మినీ లోడింగ్ ఆటోలు, ఇతరత్రా భారీ వాహనాలకు అడ్డాగా ఆయా ప్రాంతాలు నిలుస్తున్నాయి. కొందరు కాలువలపై సిమెంట్ బేస్‌మెంట్‌తో బడ్డీలను ఏరాటు చేస్తున్నా సంబంధిత అధికారులకు కానరావడం లేదు. సాయంత్రం వేళ ట్రాఫిక్ జామ్ నెలకొనడంతో పాటు భారీ వాహనాలు వస్తే చాలా సేపు వేచిఉండాల్సిన దుస్థితి నెలకొంటోంది. అసలు ఎవరి అనుమతితో వీటిని ఇష్టానుసారంగా ఆయా కాలువలపై ఏర్పాటు చేశారో సంబంధిత అధికారులకే తెలియాలి. రానున్న వర్షాకాలంలో కాలువల్లోని ప్రవహించే మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తే సమస్య మరింత జటిలంగా తయారయ్యే అవకాశం ఉంటుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సింహవల్లీ తాయార్, సుమర్ల అమ్మవార్ల తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బంగారు తొళ్లక్కియాన్‌లో ఉంచారు. ఆలయ ఆస్థాన విద్వాంసుల సునాద నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ బేడామండపంలో తిరువీధి ఉత్సవాన్ని జరిపారు. అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రంపాలెం పాఠశాలపై లోకేశ్ ఫోకస్

... 5వ పేజీ తరువాయి

మైదానం ఎత్తు పెంచాలని చెబుతున్నారు. మరింత మట్టి తోలి రోలింగ్ చేయాల్సి ఉంటుందని ఇంజనీర్ ఒకరు పేర్కొన్నారు. ఈ విషయం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా మంత్రి లోకేశ్ ఆదేశాలతో చంద్రంపాలెం పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తాత్కాలికంగా ఏపీ మౌలిక వసతుల కల్పన సంస్థ కొంత వరకు మట్టివేసి చదునుచేస్తోందన్నారు. భవిష్యతులో మైదానం పక్కాగా ఉండాలంటే మరిన్ని నిధులు అవసరమన్నారు. ఇంజనీరింగ్ నిపుణులతో ప్రతిపాదన తయారుచేయించి కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

ఆర్టీసీ దసరా స్పెషల్స్ 300

... 5వ పేజీ తరువాయి

ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. దసరా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆర్టీసీ రీజనల్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, ట్రాఫిక్ మేనేజర్లు, కంట్రోలర్లు అప్రమత్తంగా ఉండాలని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ప్రయాణికుల డిమాండ్ ఉంటే రాత్రి సమయాల్లో కూడా ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

... 5వ పేజీ తరువాయి

ప్రస్తావించారు. గురువారం నాటి ఘటన విమానాశ్రయ పరిసరాల్లో పరిశుభ్రతపై దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని విమాన ప్రయాణికులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్టులోనే విమానం

పక్షి ఢీకొన్న ఘటనలో మరమ్మతులకు గురైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ప్రస్తుతం విశాఖ విమానాశ్రయంలోనే ఉన్నట్టు సమాచారం. దానికి సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిసింది.

ఉద్యోగుల చేతుల్లోనే స్టీల్‌ప్లాంటు భవిష్యత్తు

... 5వ పేజీ తరువాయి

ప్రధానంగా ముడి సరకులు కొరత ఉందని, ఇంకా మూడున్నర దశాబ్దాల కిందట కర్మాగారం కావడంతో నిర్వహణపరమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వాటి పరిష్కారంలో సిబ్బంది సహకారం చాలా అవసరమన్నారు. కొందరూ స్టీల్‌ప్లాంటు ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని, దయచేసి అలాంటి పనులకు పాల్పడవద్దన్నారు. సీఎండీ సహా ఉన్నతాధికారులంతా కొద్దిరోజులు మాత్రమే ఇక్కడ ఉంటారని, ఆ తరువాత వెళ్లిపోతారని, శాశ్వతంగా ఉండేది ఉద్యోగులు మాత్రమేనన్నారు. కాబట్టి వారే ప్లాంటు పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. మూడు ఫర్నేస్‌లను వంద శాతం సామర్థ్యంతో నడపాలన్నారు. టీమ్ వర్క్, ఎవరు ఎక్కడైనా పనిచేసేలా అన్నింటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ వనరులును సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంటు భూముల అమ్మకంపై అపోహలు పెట్టుకోవద్దన్నారు. ఉద్యోగులకు అక్టోబరు నుంచి వంద శాతం జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అన్నీ కుదుటపడి ప్లాంటు పూర్వస్థితికి వస్తే మళ్లీ ప్రమోషన్‌లు ఇస్తామని భరోసా ఇచ్చారు.

ఉలిక్కిపడిన పారిశ్రామిక ప్రాంతం

... 5వ పేజీ తరువాయి

మండల తహశీల్దార్ రమేష్‌నాయుడు, ఆర్ఐ దివ్య సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్రెసర్ స్టార్ట్ చేసినప్పుడు అక్కడ కేవలం నలుగురు కార్మికులు మాత్రమే ఉన్నారని, వారు కూడా ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారని తెలిపారు.

భద్రత లేదు: సీఐటీయూ

నూతనంగా నిర్మిస్తున్న యూనిట్‌లో కార్మికులకు భద్రత లేదని సీఐటీయూ నాయకుడు లక్ష్మణమూర్తి ఆరోపించారు. ప్రస్తుతం నిర్మిస్తున్న యూనిట్‌లో ఇంకా పనులు కొనసాగుతుండగానే చమురు శుద్ధి పనులు మొదలుపెట్టేశారని ఆరోపించారు. అంత భారీపేలుడు సంభవించినప్పటికీ అధికారులు సైరన్ మోగించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యం కార్మికులకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

కల్తీ నెయ్యి ముఠా గుట్టు రట్టు

... 5వ పేజీ తరువాయి

గమనించారు. వివిధ కంపెనీలకు చెందిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో బళ్లారి నుంచి తెచ్చిన క్రీమ్స్‌ను కలిపి నెయ్యి మాదిరి తయారు చేస్తున్నట్టు, వాసన రావడానికి కొన్నిరకాల రసాయనాలను వినియోగిస్తున్నట్టు ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు గుర్తించారు. కల్తీ నెయ్యిని కిలో రూ.350 చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో ఫంక్షన్లకు కేటరింగ్ చేసే సంస్థలకు విక్రయిస్తున్నట్టు తేల్చారు. కల్తీ నెయ్యి తయారుచేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న బళ్లారికి చెందిన లక్ష్మీపతి, శ్రీధర్, రాజశేఖర్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తయారుచేసిన 120 కిలోల కల్తీ నెయ్యిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించనున్నట్టు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్.ఐ. భరత్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తం

... 5వ పేజీ తరువాయి

ఆపివేయాలని కోరారు. డిప్యూటీ మేయర్ దల్లిగోవిందరాజుతోపాటు దక్షిణ నియోజకవర్గానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని డీసీపీ హరిదాసుతో చర్చించారు. శుక్రవారం రాత్రి మరోసారి దుకాణాలు తొలగింపునకు అధికారులు సమాయత్తమవ్వడంతో కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను తొలగించడం ప్రారంభించారు.

ఫుడ్‌కోర్టు తొలగింపు హేయమైన చర్య

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన నైట్ ఫుడ్‌కోర్టు తొలగింపు హేయమైన చర్య అని ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యేనైన తనకు కనీసం సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్‌కు లేదా? అని ప్రశ్నించారు. ఫుడ్‌కోర్ట్‌ను తొలగించాలని వారిద్దరే నిర్ణయించుకుని వ్యాపారులకు కూడా నోటీసు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఫుడ్ కోర్టు అంశాన్ని మరోసారి కౌన్సిల్‌లో చర్చకు పెడితే మెజారిటీ చూపించుకోవచ్చునన్నారు. అధికారులు చేసిన పని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఊరుకునేది లేదన్నారు. ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని ఒక్కసారి రోడ్డునపడేయడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానన్నారు. వ్యాపారులకు కార్డులు జారీ చేసి అద్దె నిర్ణయిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు.

కౌన్సిల్ తీర్మానం ప్రకారమే తొలగింపు

నైట్ ఫుడ్‌కోర్టును తొలగించాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో చేసిన తీర్మానానికి అనుగుణంగానే తాము చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న ఫుడ్‌కోర్టు వల్ల జీవీఎంసీకి కనీసం ఆదాయం రాకపోగా, ట్రాఫిక్‌కు, పరిశుభ్రతకు ఇబ్బందికరంగా ఉంటోందన్న ఫిర్యాదులు ఎక్కువగా అందుతున్నాయన్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఫుడ్‌కోర్టు ఒక్కటే కాకుండా నగరంలో అన్నిచోట్ల ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. టౌన్ వెండింగ్ కమిటీ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిని గుర్తించి వారికి దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తామన్నారు.

రహదారులపై ఆక్రమణల తొలగింపు



గాజువాక కణితి రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు


స్థానికులతో మాట్లాడుతున్న జోన్ 5 కమిషనర్ రాము

- జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకే పనులు చేపట్టామని స్పష్టం చేసిన అధికారులు
- ములగాడలో బెల్టుషాపు తొలగింపుతో హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు

గాజువాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ పరిధిలో ప్రధాన రహదారులను, డ్రైనేజీలను ఆక్రమించి ఏర్పాటు చేసిన చిన్నపాటి బడ్డీలు, ఇతర ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ రోడ్డు, గాజువాక కణితి రోడ్డు ప్రాంతంలో అక్రమ దుకాణాలను తొలగించారు. గాజువాక జోనల్ పరిధిలో అనధికారికంగా వ్యాపార సంస్థలను రోడ్లపై నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్య పెరుగుతోందని, దీని వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్లపై ఆక్రమణలు తొలగిసుతన్నామని జోనల్ కమిషనర్ శేషాద్రి తెలపారు. అన్ని వార్డుల్లోను ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ఒకసారి తొలగించిన తరువాత మరోసారి ఎవరైన బడ్డీలు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ములగాడలో ఆక్రమణల తొలగింపు

మల్కాపురం, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు ములగాడ గ్రామంలో ఆక్రమణలను శుక్రవారం జోన్ 5 రెవెన్యూ సిబ్బంది, గాజువాక పోలీసులు తొలగించారు. ఇటీవల గ్రామంలో వెలసిన బెల్ట్‌షాప్‌లు వద్ద అకతాయిలు మద్యం, గంజాయి సేవించి సంఘవిద్రోహ కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో గ్రామస్థుల ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించారు. జంక్షన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. పోలీసులు గురువారం రాత్రి పికెటింగ్ నిర్వహించి దుకాణాలను తొలగించాలని నిర్ణయించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్థులతో అధికారులు మాట్లాడారు. జోన్ 5 రాము తొలగింపు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు జోనల్ అధికారులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల నిరసన


నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

పెందుర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలోని కార్డు ప్రైమ్ 2.0లో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలంటూ దస్తావేజు లేఖరు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది. చినముషిడివాడ పరిధిలోని దస్తావేజు లేఖర్లు తమ కార్యాలయాలు మూసివేశారు. రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 2.0లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పితాని నాగరాజు, బలగ చిన్నారావు, పెంటకోట శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్డు ప్రైమ్ 2.0తో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆధార్‌కార్డు, ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ల నిర్వహణలో ఏర్పడుతున్న సమస్యలను వివరించారు. నామినల్ పద్ధతిలో జరిగే రిజిస్ట్రేషన్లపై ఆధారపడే దస్తావేజు లేఖర్లకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో నామాల సత్యనారాయణ, నంబాళ్ల రాము, సుధీర్, పొన్నగంటి సురేశ్, గంటి శర్మ, గొర్లె శంకరరావు, ముక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారులపై పొంచి ఉన్న ముప్పు


బెహరా ఆస్పత్రి ఎదురుగా సర్వీసు రోడ్డులో కుంగిన యుజీడీ మ్యాన్‌హోల్


ఎల్లపువానిపాలెం-ఎయిర్‌పోర్ట్ రోడ్డులో శిథిలమైన కల్వర్టు

గోపాలపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రహదారులపై శిథిలమైన కల్వర్టులు, మ్యాన్‌హోల్‌లకు సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక ఎల్జీ పాలిమర్స్ కూడలి నుంచి గోపాలపట్నం బంక్ కూడలి సర్వీస్ రోడ్డులో రెండు నెలల క్రితం యూజీడీ మ్యాన్‌హోల్ శిథిలమైంది. అప్పటి నుంచి చాలా మంది వాహన చోదకులు ప్రమాదాలకు గురైనప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో కల్వర్టు మరింత కుంగిపోయింది. దీంతో ద్విచక్రవాహన చోదకులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా ఎల్లపువానిపాలెం ఎస్సీకాలనీ నుంచి విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో కల్వర్టు శిథిలమై ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు దృష్టిసారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

'యువత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం'



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ ఉండి మనషారాయ్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలని రిసోర్స్ పర్సన్ ఉండి మనషారాయ్ అన్నారు. స్టీల్ ప్లాంట్ శ్రీప్రీ స్కూల్‌లో యువత మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత శారీరకంగా చురుగ్గా ఉండాలని, భావోద్వేగ సమతుల్యత కాపాడుకోవాలని సూచించారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని, ఒత్తిడికి గురికావద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురవుతున్న గెడ్డలు

- నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు


అధికారులు కూల్చేసిన సిమెంట్ కోలమ్స్

పెందుర్తిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పురుషోత్తపురం పరిసర గెడ్డ వాగు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధుల అనుచరులే ఆక్రమణలకు పురిగొల్పుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేతివాటం ప్రదర్శించి జేబులు నింపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో పురుషోత్తపురం పైడిమాంబ ఆలయ మార్గంలోని గెడ్డ చాలావరకు ఆక్రమించుకుని పక్కా నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు స్పందించడంతో ఆక్రమణలకు బ్రేక్ పడింది. తాజాగా ఆక్రమణదారులకు అన్ని పార్టీ నేతలు భరోసా ఇవ్వడంతో మళ్లీ ఊపందుకొన్నాయి. గెడ్డ భాగంలో దట్టమైన పొదల మాటున ఆక్రమణలు, నిర్మాణాలు జరుగుతున్నాయి. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు స్పందించారు. ఆక్రమణలను అడ్డుకుని గెడ్డ స్థలంలో నిర్మించిన సిమెంట్ కోలమ్స్‌ను కూల్చేశారు. అయితే వాటిని తిరిగి నిర్మించుకునేందుకు స్థానిక నాయకులు భరోసా ఇచ్చి, అధికారుల వద్ద పైరవీలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'ఉద్యోగుల బకాయిలు చెల్లించండి'



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలు సత్వరమే చెల్లించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని కోరారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జోనల్, జిల్లా స్థాయి అధ్యక్ష, కార్యదర్శుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, 11వ పీఆర్సీకి సంబంధించిన 24 నెలల డీఏ బకాయిలు చెల్లించక పోవడం, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించక పోవడంతో ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకొని బకాయిలు మొత్తం చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల ఆర్థిక పరమైన డిమాండ్లు సత్వరమే పరిష్కరించాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో భానుమూర్తి, జోనల్ కృష్ణమూర్తి, వెంకటరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంకుకు కృషి

- ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్




సభలో మాట్లాడుతున్న ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా పనిచేస్తూ భవిష్యత్తులో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మెరుగైన స్థానాన్ని సాధించాలని ఏయూ ఉప కులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సూచించారు. విభాగాధిపతులు, ప్రిన్సిపాళ్లు, డీన్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశం లో వీసీ మాట్లాడుతూ విభాగం నుంచి విశ్వ విద్యాలయం వరకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. భవిష్యత్తులో మెరుగైన ర్యాంకును సాధించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విభాగాధిపతులకు సూచించారు. ఏయూ అవుట్ రీచ్ డీన్ ప్రొఫెసర్ కె.రమాసుధ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కేటాయించే సమయంలో పరిగణనలోకి తీసుకునే అంశాలను వివరించారు. ఆయా విభాగాల్లో మెరుగుపడాల్సిన అంశాలను తెలిపారు. ఏయూ పట్ల సానుకూల అవగాహనను పెంపొందించడానికి కృషిచేయాలన్నారు. విదేశీ ప్రొఫెసర్లను స్వాగతించడం, పరిశోధనల్లో ప్రగతి, రీసెర్చ్ ప్రాజెక్టులను సాధించడం ప్రధానమన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, డీన్లు, విభాగాధిపతులు పలు సూచనలిచ్చారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు పాల్గొన్నారు.

తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు

పెందుర్తి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం కేజీహెచ్‌కు వెళ్లిన తన తల్లి కనిపించలేదని ఆమె కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. అయ్యప్పనగర్‌కు చెందిన మొల్లేటి వరలక్ష్మి (58) శ్రీకాకుళం జిల్లా సోంపేటలోని ఓ సంస్థలో కేర్ టేకర్‌గా పనిచేస్తోంది. 15 రోజులు క్రితం డ్యూటీకి వెళ్లిన ఆమె ఆరోగ్యం బాగాలేదని 17న ఇంటికి వచ్చింది. అదేరోజు కేజీహెచ్‌కు వెళతానని అనకాపల్లిలో ఉంటున్న కుమార్తెకు ఫోన్‌చేసి చెప్పింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. అంతేకాకుండా ఆమె సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఏయూలో సందడిగా విలు విద్య పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం స్పోర్ట్సు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల విలువిద్య (ఆర్చరీ) పోటీలు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో జరిగాయి. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఒలింపిక్స్ గుర్తింపు ఉన్న ప్రధాన క్రీడలలో విలువిద్యకు ప్రత్యేక స్థానముందని పేర్కొన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో కె.సాహితి రత్న, రికర్వ్ రౌండ్‌లో ఎ.జె.లక్ష్మి, కాంపౌండ్ రౌండ్‌లో ఆర్.మోహన్ సాయి పూజిత, ఎ.టి.ప్రశాంత్ రెడ్డి, కె.కృష్ణ, ఎస్.విజయ్‌కుమార్ ప్రతిభ కనబరిచారని, త్వరలో గురు కాశి యూనివర్సిటీలో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల విలువిద్య టోర్నీలో పాల్గొంటారని ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ పి.కిషోర్, కోచ్ శివకుమార్, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో వార్షికోత్సవ సందడి

ఆరిలోవ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల కనకమహాలక్ష్మి నగర్‌లో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ నేతలు కేకును కట్ చేసి ఆనందం పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పాత్రకుండ ధర్మారావు, 13వ వార్డు తెలుగు మహిళ అధ్యక్షురాలు మజ్జి రమణి, తదితరులు పాల్గొన్నారు.


ప్రసాదుల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంపీ ఎం.శ్రీభరత్

ఏపీఐఐసీ డైరెక్టర్‌కు సత్కారం

గాజువాక, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమితులైన గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్‌ను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ శుక్రవారం సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యత అప్పగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమ ంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ


వృద్ధురాలికి నిత్యావసర సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడతున్న 85వ వార్డుకు చెందిన ఐదు కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ట్రస్టు ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు లక్ష్మీపురం ప్రజల ఆరాధ్య దైవాలైన దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లమ్మ అమ్మవార్లకు శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు అవిరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 22 ఉంచి అక్టోబరు 2 వరకూ రోజుకో అవతారంలో త్రిశక్తి అమ్మవార్లను విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదా లు స్వీకరించాలని కోరారు. దసరా ఉత్స వాల సందర్భంగా 70, 87వ వార్డుల్లోని అమ్మవార్ల ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

సినిమా గైడ్

- **మిరాయి** : జగదాంబ, మెలోడి, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : లీలామహల్, సంగం, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక),
- **అర్జున్ చక్రవర్తి** : రమాదేవి,
- **మదరాసి** : శ్రీకన్య
- **ఘాటీ** : కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : , శ్రీకన్య-2 (గాజువాక)
- **కూలీ** :వెంకటేశ్వర-1, అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 12, టమాటా 26, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 70, బరబాటి 36, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 38, చిలగడదుంపలు 34, కంద 44, దేముడు చిక్కుడు 68, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280


ఎంపీ శ్రీభరత్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కార్మిక నాయకులు

పీఎఫ్ సమస్యను పరిష్కరించండి

- భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘం నాయకుల వినతి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కార్మికులను ఆందోళనకు గురిచేస్తున్న పీఎఫ్ రికార్డుల్లో డేట్ ఆఫ్ జాయినింగ్ సమస్యను పరిష్కరించాలని ఎంపీ శ్రీ భరత్‌కు భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘ నాయకులు వినతి పత్రాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్మాగారంలో 1992లో చేరిన ఆర్ సిరీస్, టీ సిరీస్ కార్మికుల పీఎఫ్ రికార్డుల్లో డేట్ ఆఫ్ జాయినింగ్ నమోదులో వచ్చిన పొరపాట్ల వల్ల సుమారు 150 కార్మికులు పదవి విరమణ సమయంలో తీవ్ర ఆర్థిక నష్టం ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. డేట్ ఆఫ్ జాయినింగ్‌ను సరిచేసి హెచ్‌పీవీపీలో అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో 'లాజిస్టిక్స్ ఫర్ ఆల్' పై అవగాహన


కళాశాల రెక్టార్‌ను సత్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

అగనంపూడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లాజిస్టిక్స్ రంగం భారత ఆర్థిక వృద్ధికి వెన్నెముక అని విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు అన్నారు. విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన లాజిస్టిక్ ఫర్ ఆల్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లాజిస్టిక్స్ రంగంపై అవగాహన క్లాస్‌రూం నాలెడ్జ్, పరిశ్రమ అవసరాల మధ్య వారధిగా నిలుస్తాయన్నారు. ఈ అనుభవం విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త మార్గాలు చూపుతుందన్నారు. కార్యక్రమంలో సీఐఐ కౌన్సెలర్ లాజిరీస్, శ్రావణ్ షిప్పింగ్ ఎండీ జి.సాంబశివరావు, పలు సంస్థల సీఈవోలు పాల్గొన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో సర్టిఫికేషన్ సర్వీసెస్‌పై శిక్షణ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతదేశ వైద్య సాంకేతిక రంగంలో రోగుల భద్రత చాలా ముఖ్యమని మెడ్‌టెక్ జోన్ సీఈవో జీతేంద్ర శర్మ అన్నారు. కేహెచ్‌ఐటి సర్టిఫికేషన్ సర్వీసెస్ (కేసీఎస్) ఇటీవల వైద్య పరికరాల కోసం సర్టిఫికేషన్‌పై సమగ్ర శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిపుణులకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగు పరుచుతున్నామన్నారు.

మొబైల్ హెల్త్‌కేర్ యూనిట్ ప్రారంభం



జెండా ఊపి మొబైల్ హెల్త్‌కేర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

పెదగంట్యాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ హెల్త్‌కేర్ యూనిట్ ప్రారంభమైంది. ఎంపీ శ్రీభరత్ శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద దీన్ని ప్రారంభించారు. ఈ హెల్త్‌కేర్‌లో డాక్టర్, ఫార్మసిస్ట్, కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లతో కూడిన బృందం గాజువాక, పెదగంట్యాడ పరిధి గ్రామాల్లో మధుమేహం, బీపీ వంటి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులకు స్క్రీనింగ్‌తో పాటు ప్రాథమిక వైద్యసేవలు అందిస్తుందని తెలిపారు. తీవ్రమైన కేసులను సమీప ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సిఫార్సు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ గ్రామస్థుల గడపదగ్గరకు ఆరోగ్యసేవలు అందిస్తుందన్నారు. ఈ దిశగా ఆదానీ గంగవరం పోర్టు తీసుకున్న సీఎస్ఆర్ కార్యక్రమం అభినందనీయమన్నారు.

సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ వద్దంటూ నిరసన


ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయవద్దని సీపీఐ గాజువాక సమితి సభ్యులు శుక్రవారం ఆందోళన చేశారు. సిమెంట్ యూనిట్ ఏర్పాటు చేయడానికి కేటాయించిన భూ ములను వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పెదగంట్యాడ మండలం సర్వే నంబరు 97పీ, 98, 99పీ, 101పీలలో సమారు 20 ఎకరాల భూమిని అదానీ మెస్సర్స్ అంబుజా లిమిటెడ్‌కు, గంగవరం సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించిందని, ఇందుకు వచ్చే నెల8న ప్రజాభిప్రాయం సేకరణకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండ లి ప్రకటన విడుదల చేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలని కోరారు. ఏర్పాటు చేస్తే పెదగంట్యాడ, గాజువాక ప్రాంతాలు కాలుష్యంతో నిండిపోతాయని, పేర్కొన్నారు. ముఖ్యంగా నీరు వాయువు కాలుష్యంతో నిండిపోతాయని, తద్వారా అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయని వారు స్పష్టం చేశారు. చిన్న చిన్నపిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడతారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు నిరాకరించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వనజాక్షి, గాజువాక నియోజక వర్గం సీపీఐ నాయకులు జి ఆనంద్, పల్లేటి పోలయ్య, కె అచ్యుతరావు, పిల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విధుల కు గైర్హాజరవడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చర్యలు తీసుకున్నారు. నగర పరిధి పీఠాపురం కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదని, విధులకు డుమ్మా కొడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల పై గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో స్టాఫ్ నర్సు లేరు. వైద్యురాలు బయటకు వెళ్లిపోయారు. ఫార్మాసిస్టు యూనిఫామ్ వేసుకోలేదు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ శుక్రవారం తనిఖీలకు వెళ్లగా అదే పరిస్థితి నెలకొంది. దీంతో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఫార్మాసిస్టును మందలించారు. వ్యవహారశైలి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా షోకాజ్ నోటీసు తీసుకున్న స్టాఫ్ నర్సు పూజిత శుక్రవారం ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద హల్‌చల్ చేశారు. చేతిని కోసుకుని అధికారులను బెదిరించే ప్రయత్నం చేశారు. కొద్దిసేపటికి తిరిగి వచ్చి క్షమించాలని, తీవ్ర ఒత్తిడిలో చేశానని చెప్పిందని అధికారులు చెబుతున్నారు. కాగా ఈ అర్బన్ హెల్త్ సెంటర్ వ్యవహారం రచ్చకు దారి తీయడం వెనుక బలమైన కారణాలున్నట్టు చెబుతున్నారు. స్థానిక కార్పొరేటర్‌కు, అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి మధ్య నెలకొన్న విబేధాలతో రచ్చ జరుగుతోందని, కార్పొరేటర్ వేధిస్తున్నాడని సిబ్బంది చెబుతుండగా, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడాన్ని ప్రశ్నించడంతోనే ఆరోపణలు చేస్తున్నారని కార్పొరేటర్ పేర్కొంటున్నారంటున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఏయూ ప్రొఫెసర్ సాల్మన్ రాజు



విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చైనాలోని యన్‌చెంగ్ నగరంలో ఈ నెల 24, 25 తేదీల్లో వరల్డ్ కోస్టల్ ఫోరమ్ నిర్వహించనున్న సదస్సుకు ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం గౌరవ ప్రొఫెసర్ ఏజే సాల్మన్ రాజుకు ఆహ్వానం అందింది. ఈ సమావేశాన్ని చైనాలోని జియంగ్స్ ప్రావిన్స్ ప్రభుత్వంతోపాటు అక్కడి సహజ వనరుల మంత్రిత్వశాఖ, జాతీయ అటవీ, గడ్డి భూముల పరిపాలన విభాగం నిర్వహిస్తున్నాయి. సముద్ర తీర చిత్తడి నేలలు, మడ అడవులు (మాంగ్రూవ్స్) పర్యావరణ వ్యవస్థ ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రొఫెసర్ సాల్మన్ రాజు ప్రసంగించనున్నారు. వాతావరణ మార్పుల వల్ల సముద్ర మట్టాలు పెరగడం, మానవ కార్యకలాపాలతో తీర పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినడం వంటి పరిస్థితుల నేపథ్యంలో నిర్వహించే సమావేశం ప్రాముఖ్యతను సంత రించుకుంది. ఈ సదస్సులో ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు, అంతర్జాతీయ సంస్థలు, స్వదేశీ, విదేశీ ప్రభుత్వాల ప్రతిని ధులు, రక్షిత ప్రాంతాల నిర్వాహకులు, నిపుణులు, పండి తులు, యువత, వ్యాపార వేత్తలు పాల్గొంటారు.

జోధ్‌పూర్‌లో మేయర్ బృందం



జ్ఞాపికను బహూకరిస్తున్న జోద్ పూర్ మేయర్ వనితా సేథ్

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కార్పొరేటర్ల అధ్యయనయాత్రలో భాగంగా శుక్రవారం రాజస్థాన్‌లో జోధ్‌పూర్ మునిసిపల్ కార్పొరేషన్‌ను సందర్శించారు. మేయర్ పీలా శ్రీనివాసరావు కార్పొరేటర్లకు జోధ్‌పూర్‌మేయర్ వనితాసేథ్, కమిషనర్ సిద్దార్థపళనిదామి ఇతర అధికారులు స్వాగతం పలికారు. జోధ్‌పూర్‌లో అమలుచేస్తున్న ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై అధికారులు కార్పొరేటర్లకు పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా జీవీఎంసీలో అమలు చేస్తున్న ప్రాజెక్టులు, పారిశుధ్య నిర్వహణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల పునర్వినియోగం గురించి వివరించారు.

భీమిలి ఈఈకి హౌసింగ్ పీడీ బాధ్యతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలను భీమిలి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సూరిబాబుకు అప్పగించారు. సంస్థ పీడీ సత్తిబాబు అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారు. ఈ నేపథ్యంలో సంస్థ కార్యకలాపాలు , ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ కోసం సూరిబాబుకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు.

సమష్టి కృషితో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

- సమ్మిళిత రంగాలకు ప్రాధాన్యమివ్వాలి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను వెల్లడించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం జిల్లా అధికారులతో సమావేశమైన ఆయన ఈ నెల 15, 16 తేదీల్లో సీఎంతో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను వెల్లడించారు. జిల్లాసర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన పది సూత్రాల ఆధారంగా పనులు చేపట్టాలన్నారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల పనులు పూర్తిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానుబంధ రంగాలపై దృష్టి సారించాలని, పట్టణ ప్రాంతాల్లో నిర్మాణాలు, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి చేపల వేటను సాగించేలా మత్స్యకారులను సిద్ధం చేయాలన్నారు. పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, పెట్టుబడులను ఆకర్షించేలా అధికారుల నుంచి సహకారం, ప్రోత్సాహం అవసరమన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ ఎంఈ పార్కుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాల న్నారు. ప్రసాద్ స్కీమ్ పనులను త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. కమ్యూనికేషన్ నెట్‌వర్క్ పెంచాలని, బ్యాంకింగ్ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఇళ్లను త్వరితగతిన నిర్మించి, మౌలిక వసతులు కల్పించా లన్నారు. స్వచ్ఛ రథం సేవలను అందుబాటులోకి తేవాలని, గ్రే వాటర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహిత విశాఖను తీర్చిదిద్దేందుకు కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను వాడవద్దన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పారదోలాలన్నారు. పోర్టు, షిప్ యార్డ్, ప్రధాన పరిశ్రమలు, పారిశ్రామిక కారి డార్లలో పారిశుధ్య చర్యలను పరిశీలించాలని, డ్రోన్ సాయంతో తదుపరి చర్యలు చేపట్టాలని పొల్యూ షన్ కంట్రోల్ బోర్డు అధికారులకు సూచించారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ, బిల్డింగ్ పీనలైజేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ పెరిగేలా చర్యలు చేపట్టాలని, ప్రాపర్టీ, వాటర్ ట్యాక్స్ వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. పీ-4పై ప్రధానంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే ప్రక్రియను ప్రోత్సహిస్తూ సహాయ, సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్‌వో భవానీశంకర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

రాష్ట్రంలో పెట్టుబడులకు సానుకూల వాతావరణం

- అన్ని వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం: ఎంపీ శ్రీభరత్
- మెడ్‌టెక్ జోన్‌లో ఏపీ క్లీన్ ఎనర్జీ ఎక్స్‌పో ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఎంతో అనుకూలమని, ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ మెడ్‌టెక్ జోన్‌లో ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ ఎక్స్‌పో, ఇన్వెస్టర్స్ కాన్‌క్లేవ్ (ఏపీసీఎక్స్‌పో)- 2025 ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ రాష్ట్ర ప్రగతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో శ్రమిస్తున్నారని, పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నూతన ఆవిష్కరణలతో సత్తా చాటాలన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా ఇటువంటి ఎక్స్‌పో నిర్వహించడం అభినందనీయమన్నారు. పునరుత్పాదకశక్తి, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ అను బంధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించడం, విస్తరించడం, తదితర వ్యూహాలపై విస్తృత చర్చలు జరిపారు. అగ్రికల్చర్, సోలార్ రెండూ ఒకేచోట ఎలా అమలు చేయాలనేదానిపై నివేదికను విడుదల చేశారు. సూర్యఘర్‌పై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌పోలో న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ) ఎండీ ఎం.కమలాకర్‌బాబు, రైల్వే డీఆర్‌ఎం లలిత్ బోర, నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక, పలు సంస్థల యజమానులు, సీఈవోలు పాల్గొన్నారు. అత్యాధునిక క్లీన్ ఎనర్జీ సొల్యూషన్లు, ఇన్నోవేషన్లు, వ్యాపార మోడల్స్‌ను ఎక్స్‌పోలో ప్రదర్శించారు.



పలు సంస్థల సీఈవోలు, ఇన్వెస్టర్లతో సమావేశమైన ఎంపీ శ్రీభరత్



సూర్యాంధ్ర ప్రగతి రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

క్రైం... crime news

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి



అబ్బాయి మృతదేహం

వేపగుంట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగలడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సింహాచలం డిపో ఎదురుగా శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి... చెంగల్రావు పేటకు చెందిన బెహరా అబ్బాయి (67) బాలాజీ గార్డెన్స్‌లోని భవనంలో ఇంటీరియర్ పనులు చేయడానికి వెళ్లాడు. ఇనుప రాడ్‌ను రెండో అంతస్తులోకి తీసుకువెళ్తుండగా సమీపంలోని 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఏడీఈ అప్పన్న, ఏఈ పద్మనాభం సంఘటన స్థలంకు చేరుకొని తీగల్లో చిక్కుకున్న రాడ్డును తొలగించి, క్షతగాత్రుడ్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. బెహరా అబ్బాయికి భార్య, పిల్లలున్నారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



శ్రీదేవి మృతదేహం

సీతంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోతినమల్లయ్యపాలెం మారికవలసకి చెందిన పంచాలి శ్రీదేవి (37) ప్రకాశ్‌నాయుడు దంపతులు సంగంశరత్ సినిమా థియేటర్ వెనుక రోడ్డులో ఉంటున్నారు. ప్రకాశ్ నాయుడు ఆటో డ్రైవర్. వీరికి కుష్మ కుమార్తె ఉంది. కొద్దికాలంగా భార్యాభర్తలు గొడవలు పడి విడిగా ఉండేవారు. పెద్దల సమక్షంలో రాజీ పడి కలిసి కాపురం చేస్తున్నారు. ప్రకాశ్‌నాయుడు మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి ఆటోలో వెళ్లాడు. అతడి వెంట శ్రీదేవి వెళ్లింది. సంగంశరత్ థియేటర్ వద్ద ప్రకాశ్‌నాయుడు మరో మహిళతో ఉండడాన్ని ఆమె చూసింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీదేవి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె కుమార్తె కుష్మ తల్లి వద్దకు చేరుకొని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. అక్కడి నుంచి కేజీహెచ్‌కి తరలించింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నడచి వెళుతున్న వృద్ధుడు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. తగరపువలసకు చెందిన పోలిపిల్లి కృష్ణ (65) ఈ నెల 17 రాత్రి ఎనిమిది గంటల సమయంలో వెంకోజీపాలెం నుంచి హనుమంతువాక వైపు నడచుకుంటూ వెళుతుండగా వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొంది. దీంతో కృష్ణ రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలవడంతో విమ్స్‌కి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడి అల్లుడు కొల్లేటి అప్పలరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజ్ చేసిన 346 వాహనాలు అప్పగింత

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్‌కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో పోలీసులు సీజ్‌చేసి ఏళ్లతరబడి పోలీస్‌స్టేషన్లలో ఉండిపోయిన 346 వాహనాలను సీపీ శంఖబ్రతబాగ్చి శుక్రవారం యజమానులకు అప్పగించారు. ఏఆర్ పోలీస్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని పోలీస్‌స్టేషన్లలో సీజ్డ్ వాహనాలు పేరుకుపోవడంతో స్థల సమస్యతోపాటు పారిశుధ్య సమస్య ఏర్పడుతోందన్నారు. ఏళ్ల తరబడి వాహనాలు ఒకేచోట ఉండిపోవడంతో పాడైపోయి, కోర్టు ఉత్తర్వులు జారీ చేసి యజమానికి తీసుకెళ్లేందుకు వచ్చేసరికి పనికిరాకుండా పోతున్నాయన్నారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పోలీస్‌స్టేషన్ల ఆవరణలో పేరుకుపోయిన సీజ్డ్ వాహనాలను డిస్పోజ్ చేయడంపై దృష్టిపెట్టానన్నా రు. కేంద్రహోంశాఖ జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి సీజ్డ్ వాహనాలను వాటి యజమానులకు అప్పగించేందుకు 'వెహికల్ రిటర్న్ మేళా' నిర్వహించడం ప్రారంభించామన్నారు. తొలిదశలో ఈ ఏడాది ఫిబ్రవరి 19న 152 వాహనాలను సంబంధిత యజమానులకు అందజేయగా, ఏప్రిల్ 22న 320 వాహనాలను సం బంధిత యజమానులకు అందజేశామన్నారు. తాజాగా మూడోదశ కింద 346 వాహనాలను సంబంధిత యజమానులకు అందజేస్తున్నామన్నారు. వీటిలో 56 వాహనాలు శాంతిభద్రతల విభాగానికి సంబంధించిన కేసుల్లోని వాహనాలుకాగా, క్రైమ్ విభాగం కేసులకు సంబంధించి 12, ట్రాఫిక్ కేసులకు సంబంధించినవి 278 ఉన్నాయన్నారు.



సీజ్ చేసిన వాహనాల వద్ద యజమానులు, తాళాలు అందిస్తున్న సీపీ

గోశాల లేఅవుట్‌లో చోరీ

సింహాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింహాచలం పాత గోశాల సమీప సింహగిరి నిర్వాసితుల లే అవుట్‌లో చోరీ జరిగింది. అడివివరం సొసైటీ పాలకమండలి ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు లే అవుట్‌లో నివసిస్తున్నారు. గురువారం సాయంత్రం పెరట్లో పూలు కోసుకునేందుకు తన భార్య వెళ్లిందని, అదే సమయంలో దొంగలు చొరబడి ఐదు తులాల బంగారం, 10 తులాల రజిత ఆభరణాలు, రూ.90 వేల నగదు చోరీ చేశారని గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

బెదిరింపు కాల్స్‌పై ఫిర్యాదు

సీతంపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తనకు కొంతమంది ఫోన్ చేసి చంపుతానని బెదిరించారంటూ జీవీఎంసీ కాంట్రాక్టరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నగరంలో కోడి చెత్తను అక్రమంగా తరలిస్తుండడంపై తానే జీవీఎంసీ అధికారులకు సమాచారం ఇస్తున్నానంటూ బెదిరించాడని తెలిపారు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

24 నుంచి టీఎన్‌ఐ సమావేశాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, టీఎన్‌ఐ ప్రతినిధులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖ వేదికగా నిర్వహించనున్న ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్‌ఐ) 31వ రాష్ట్ర ద్వైవార్షిక సమావేశాల పోస్టర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అడ్వైజరీ, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సత్యవల్లి, సెయింట్ లూక్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కార్యదర్శి ఎం.ప్రీతంలూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సుకు ప్రముఖులు, ముగింపు కార్యక్రమానికి కలెక్టర్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొంటారన్నారు.

కళలను నిరంతరం ప్రోత్సహించాలి: ఏయూ వీసీ



పెయింటింగ్ వేస్తున్న కళాకారుడు రామారావు



విజేతలతో ఏయూ వీసీ రాజశేఖర్, ఇతర అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కళలను నిరంతరం ప్రోత్సహించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో లలిత్‌కళా అకాడమీ (భువనేశ్వర్), తంజావూర్‌లోని సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏయూ చిత్ర కళా విభాగంలో నిర్వహించిన వికసిత్ భారత్ కె రంగ్, కళాకే సంగ్ కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడుతూ యువతలోని ప్రతిభను గుర్తించాలన్నారు. విద్యార్థులు చిత్రలేఖనం, నృత్యం, సంగీతం నేర్చుకునేలా ప్రత్యేక మాడ్యూల్ అమలుచేస్తామన్నారు. పోటీల్లో రెండు విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలను అందించారు. ప్రొఫెషనల్ విభాగంలో ప్రథమ బహుమతిని తేజ సతీష్, ద్వితీయ బహుమతిని జానకీ రామ్, తృతీయ బహుమతిని ప్రసాద్ గెలుపొందారు. విద్యార్థుల విభాగంలో గిరి ప్రసాద్, ఎంరాజ్యలక్ష్మి, జీనత్ ఫర్వ మొదటి మూడు బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, విభాగాధిపతి డి.సింహాచలం, బీవోఎస్ చైర్మన్ శిష్టా శ్రీనివాస్, తంజావూర్ సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.రంగభాష్యం తదితరులు పాల్గొన్నారు.

టాప్ 20లో విశాఖ పోర్టుకు స్థానం

- చైర్మన్ డాక్టర్ అంగముత్తు
- అక్టోబరు 27 నుంచి మారిటైమ్ వీక్



మాట్లాడుతున్న విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు

బీచ్ రోడ్డు, సెప్టెంబరు 19, (ఆంధ్రజ్యోతి): విశాఖ పోర్టు ప్రపంచంలోని టాప్ 20 పోర్టుల లో ఒకటిగా నిలిచిందని, ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా కార్యకలాపాల సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరచడమే కారణమని పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు పేర్కొన్నారు. ఇండియా మారిటైమ్ వీక్ 2025 ఏర్పాట్లపై నోవాటెల్ హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియన్ మారిటైమ్ వీక్ అక్టోబరు 27 నుంచి 31 వరకు ముంబైలోని నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తామన్నారు. సముద్ర పరిశ్రమలోని ఆవిష్కర్తలు, పరిశోధకులు, వాణిజ్య నిపుణులు పాల్గొంటారన్నారు. సముద్ర సాంకేతికతతో తాజా ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని వెల్లడించారు. కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 82.62 మెట్రిక్ టన్నుల కార్గోను నిర్వహించామన్నారు. పోర్టు నుంచి ప్రధాన రహదారులకు కలుపుతూ పది రహదారులను నిర్మిస్తున్నామని, ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు, సరకు రవాణాను వేగవంతం చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సమావేశంలో దుర్గేష్ దూబే, పోర్ట్ ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ అనిమేష్ భారతి, ఓడరేవులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ సీనియర్ ఎకనామిక అడ్వైజర్ తదితరులు పాల్గొన్నారు.